
ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఇసుక సరఫరా : కలెక్టర్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఇసుకను సరఫరా చేసేందుకు అన్నీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకొన్న వెంటనే ఇసుకను సరఫరా చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్ బుకింగ్‌లో ఎలాంటి టెక్నికల్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. త్వరలోనే ఇసుక రీచ్‌లు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో జేసీ కార్తీక్,కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ,మైనింగ్ డీడీ చంద్రశేఖర్, ఈఈ నాగరాజు,ఆర్డీవోలు చందన, మాలోల పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శుక్రవారం 4 అక్టోబరు 2024

కొలువుదీరిన అమ్మణ్ణులు



రాపూరు : పెంచలకోనలో సౌభాగ్యలక్ష్మిగా ఆదిలక్ష్మి



నెల్లూరు : భవానీగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు



నెల్లూరు : చండీ అలంకారంలో రాజరాజేశ్వరి



నెల్లూరు : రాజరాజేశ్వరిగా ఇరుకళల పరమేశ్వరి



ఆత్మకూరు : స్వర్ణకవచాలంకృత జ్వాలాముఖిగా దర్శనమిచ్చిన అమ్మవారు



వరికుంటపాడు : శైలపుత్రి అలంకరణలో మానసాదేవి

లోకరక్షిణీ మాం పాహి!





నెల్లూరు : రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్తజనం, అమ్మవారి సన్నిధిలో ఎంపీ వేమిరెడ్డి దంపతులు



సంగంలో పెన్నా జలాలను తీసుకొస్తూ..



నెల్లూరులో 1008 కలిశాల ఊరేగింపు

- వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం
- ఆలయాల్లో అమ్మవారి అవతార దర్శనం

నెల్లూరు (సాంస్కృతికం) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా అంతటా గురువారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. జగన్మాత నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. తొలిరోజు కలిశ స్థాపన, చండీ హోమాలు, విశేష పుష్పాలంకరణలతో అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇచ్చారు. నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయంలో కలిశ స్థాపన, సంపుటీకరణ చండీ హోమం, లలితా సహస్ర నామ కుంకుమార్చన జరిగాయి. అమ్మవారు చండీ అలంకారంలో దర్శనం ఇచ్చారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులతో కలిసి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, ఉత్సవ కమిటీ చైర్మన్ అళహరి విజయకుమార్, ఈవో సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లాలోని జొన్నవాడ కామాక్షితాయి, కావలి కలుగోళమ్మ, అల్లూరు పోలేరమ్మ, పెంచల కోన ఆదిలక్ష్మి, వేదగిరి లక్ష్మీదేవి, సంగం కామాక్షిదేవీ ఆలయాల్లో కలిశ స్థాపనలు వైభవంగా జరిగాయి. అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో దర్శనం ఇచ్చారు.

● వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉద యం కలిశ స్థాపన, ప్రాణ ప్రతిష్ఠ జరిగాయి. భక్తులు 1008 కలిశాలతో పెన్నా ఘాట్ నుంచి నదీ జలాలు సేకరించారు. అమ్మవారి వెండి రథం ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. సాయంత్రం అమ్మవారు భవానీ అలంకారంలో దర్శనం ఇచ్చారు.



నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న హిందూ సంఘాల నేతలు

దేవదాయ శాఖను రద్దు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం) : తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని, హిందూ ఆలయాల్లో ఉద్యోగులుగా ఉన్న అన్యమతస్థులను తొలగించాలని పలు హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి. నగరంలోని గాంధీబొమ్మ నుంచి వీఆర్‌సీ, మద్రాసు బస్టాండ్, ఆచారివీధి మీదుగా కలెక్టరేట్ వరకు గురువారం వారు ర్యాలీని నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక నాయకులు ఏవీఆర్ మోహన్‌రావు, కాకు మురళీరెడ్డి మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లో దేవదాయ శాఖను రద్దు చేసి, హిందూ ఆలయాల నిర్వహణను ధార్మిక సంస్థలకు అప్పచెప్పాలన్నారు. అప్పుడే సనాతన ధర్మం కాపాడబడుతుందన్నారు. లౌకికవాదం పేరుతో హిందూ ధర్మంపై దాడి చేయడం దారుణమని, హిందువులు మెజారిటీగా ఉన్న దేశంలో హిందూ ఆలయాలకు, సంస్కృతికి రక్షణ లేకపోవడం బాధాకరమని వారు పేర్కొన్నారు. ఈ ర్యాలీలో టీడీపీ నాయకులు సత్యనాగేశ్వరరావు, జనసేన నాయకులు నూనె మల్లికార్జున్‌యాదవ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు శశికుమార్, రాజేంద్ర, నాగశ్రీనివాస్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో
స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్ : కలెక్టర్



వర్కుషాపులో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కన ప్రజాప్రతినిధులు

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 3 : ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతో జిల్లాలో స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్లాన్ తయారు చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఓ ఆనంద్ చెప్పారు. గురువారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ప్లాన్ తయారీపై ప్రజల నుంచి సలహాలు తీసుకోవడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులతో వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ విజన్ ప్లాన్ కోసం జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రజలంతా క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసి సూచనలు ఇవ్వాలని, ఇప్పటివరకు 50 వేల మంది వివరాలు పొందుపరచారని చెప్పారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారానే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి వీలవుతుందన్నారు. సీఎం చంద్రబాబుపై నమ్మకంతో రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ విజన్ ప్రణాళిక ద్వారా 2047 నాటికి ఉదయగిరి నియోజకవర్గ రూపురేఖల్లో మార్పు తీసుకువస్తామ న్నారు. ఈ సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ రమణ, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, డీఈవో రామారావు, డీఎంహెచ్‌వో, జిల్లా వ్యవసాయశాఖాధికారిణి సత్యవాణి, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి, భారత్ సేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసిం, రైతు సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి, లతీఫ్‌కుట్టి, సుబ్రహ్మణ్యం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దసరాలో
'ప్రైవేటు' దోపిడీ

● భారీగా టికెట్ల ధర పెంపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : దసరా పండుగ కోసం జిల్లాకు తరలివచ్చే ప్రజలకు ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు చుక్కలు చూపుతున్నారు. పండుగకు ఇతర ప్రాంతాల నుంచి ఈ నెల 8, 9, 10వ తేదీల్లో ప్రజలు జిల్లాకు తరలిరానున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు బస్సుల యాజమాన్యం టికెట్ల ధరలను భారీగా పెంచేసింది. పెంచిన ధరలను ఆన్‌లైన్‌లో ఉంచడంతో వాటిని చూసి ప్రజలు అవాక్కువుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రిజర్వు చేసుకుంటున్నారు. అయితే, ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నా సాధారణ చార్జీలనే వసూలు చేయనున్నారు.

వివిధ ప్రాంతాల నుంచి నెల్లూరుకు టికెట్ల ధరలు ఇలా (రూ.లలో)

ప్రాంతం	బస్సు	సాధారణం	పెరిగినది
హైదరాబాద్	నాన్ ఏసీ	850	1490
హైదరాబాద్	ఏసీ స్లీపర్	1600	2600
బెంగుళూరు	నాన్ ఏసీ స్లీపర్	900	1400
బెంగుళూరు	ఏసీ స్లీపర్	1000	1900
విశాఖపట్నం	ఏసీ స్లీపర్	1500	2500



నెల్లూరులో రెడ్‌క్రాస్ ప్రతినిధుల నుంచి ఉత్తమ మోటివేటర్ అవార్డు అందుకుంటున్న కావలి ఆర్టీసీ అధికారులు

శభాష్..

రక్తదానంలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన కావలి ఆర్టీసీ డిపోకు ఉత్తమ మోటివేటర్ అవార్డు లభించింది. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవంలో భాగంగా గురువారం నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నుంచి డిపో అసిస్టెంట్ మేనేజరు కేవీఆర్ బాబుకు అవార్డును అందచేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో ఆర్టీసీ భద్రతా పక్షోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. కావలి డిపో సిబ్బంది అత్యధిక సంఖ్యలో రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలవడమేగాక ప్రథమ స్థానం సాధించారని అన్నారు. కావలి డిపో తరపున అవార్డు స్వీకరించిన కేవీఆర్ బాబుకు డిపో మేనేజరు రాహూరు శ్రీనివాసులు, రామకృష్ణ, రమేష్‌బాబు, రవిప్రకాష్, ఉద్యోగ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

- కావలి

పచ్చని చెట్టుపై పిడుగు



పిడుగుపడితే ఎలా ఉంటుందో ఈ చిత్రమే నిదర్శనం. లింగసముద్రం మండలం పెదపవని గ్రామంలో శుక్రవారం రాత్రి ఉరు ములు, మెరుపు లతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో మాసాని మాలకొండయ్య అనే రైతుకు చెందిన తోటలో ఓ చెట్టుపై పెద్ద శబ్దంతో పడిగుపడింది. అంతే, చెట్టు ఇదిగో ఇలా రెండుగా చీలిపోయింది. పిడుగుపడిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

- లింగసముద్రం

ప్రశాంతంగా టెట్



నెల్లూరులోని అయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు

నెల్లూరు (విద్య), అక్టోబరు 3: డీఎస్సీ అభ్యర్థులకు సంబంధించి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తొలిరోజు జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఏపీ టెట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లావ్యాప్తంగా 9,350 మంది పరీక్షలకు హాజరవుతుండగా, వీరికి నెల్లూరులో రెండు, కావలిలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, నెల్లూరులోని నారాయణ కాలేజీలో తొలిరోజున పరీక్షలు జరగలేదు. తొలిరోజు గురువారం ఉదయం జరిగిన పరీక్షకు 725 మంది హాజరు కావాల్సి ఉండగా, 644 మంది హాజరవగా, 81 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 725 మందికిగాను 650 మంది హాజరయ్యారు. 75 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద తొలిరోజున 1450 మందిగాను 1294 మంది హాజరవగా 156 మంది గైర్హాజరయ్యారు. టెట్‌కు సంబంధించి అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలోని ఫోన్ 94411 48062, 78932 58325, 63053 64463 నెంబర్లను సంప్రదించాలని అధికారులు తెలిపారు. ఈ పరీక్షలను జిల్లా అబ్జర్వర్, రాష్ట్ర ఓపెన్‌స్కూల్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు, డీఈవో రామారావు, విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

సోమశిలలో 52.81 టీఎంసీల నిల్వ

అనంత సాగరం : సోమశిల జలాశయానికి 7,311 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా.. 52.815 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 1500, కండలేరుకు 10,000, ఉత్తర 540, దక్షిణ కాలువలకు 5 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

పదేళ్లయినా పాకులాటే!

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రగతి అంతంతే!?
- పూర్తిస్థాయిలో మంజూరుకాని పీజీ సీట్లు
- అందని ద్రాక్షలా సూపర్‌స్పెషాలిటీ వైద్యం
- ప్రధాన విభాగాలకు డాక్టర్ల కరువు
- పాలకులు స్పందిస్తేనే ప్రగతి సాధ్యం



నెల్లూరు (వైద్యం), అక్టోబరు 3 : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల జిల్లాకే తలమానికం. 2013లో పురుడు పోసుకున్న ఈ కళాశాలలో ఇప్పటికి ఎంబీబీఎస్‌ను రెండు బ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాయి. నగర నడిబొడ్డున సువిశాల స్థలంలో ఏర్పాటైన ఈ కళాశాలలో సంస్కరణ లు మాత్రం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. 2013లో అప్పటి రాష్ట్ర రెవె న్యూ శాఖ మంత్రి, ప్రస్తుతం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయ ణరెడ్డి కృషి ఫలితంగానే వైద్య కళాశాల ఏర్పడింది. అప్పట్లో రూ.400 కోట్లు వెచ్చించి కళాశాలను నిర్మించారు. మొదట్లో 150 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా 2017లో ఆ సీట్ల సంఖ్య 175లకు చేరుకుంది. అయితే పీజీ సీట్లు రాబట్టుకు నే విషయంలో అడగడుగునా ఆటంకాలు తప్పడం లేదు. 2022-23 విద్యా సంవత్సరంలో 21 విభాగాలలో 130 పీజీ సీట్లు అవసరమని నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు (ఎన్‌ఎంసీ) ప్రతిపాదనలు పంపించారు. ఇందుకోసం ఒక్కో విభాగానికి రూ.2.36 లక్షల వంతున 21 విభాగాలకు రూ.49.56 లక్షలు కూడా చెల్లించారు. కనీసం వంద సీట్లు అయినా వస్తాయని ఆశిం చిన అధికారులకు నిరాశే మిగిలింది. కేవలం 23 పీజీ సీట్లకు మాత్రమే ఎన్‌ఎంసీ నుంచి అనుమతి లభించింది. దీంతో అందే సంవత్సరం 68 పీజీ సీట్ల మంజూరు కోరుతూ రూ.89 లక్షలు చెల్లిం చారు. ఆ తర్వాత కూడా 24 పీజీ సీట్లనే కేటాయించింది. ఈ ఉత్తర్వులు తాజాగా ప్రభుత్వ వైద్య కళాశాలకు చేరాయి. ప్రభుత్వ వైద్య కళాశాలకు ఆశించిన స్థాయిలో పీజీ సీట్లు కేటాయించి ఉంటే వైద్య విద్యార్థులకు ఉపయు క్తంగా ఉండేదని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

నేడు, రేపు వార్షికోత్సవం

ప్రభుత్వ వైద్య కళాశాల వార్షి కోత్సవం శుక్ర, శనివారాల్లో జరగనుంది. ఈ రెండు రోజులు సాయంత్రం పూట విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. నృత్య ప్రదర్శనలతోపాటు స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖుల వేషధారణలతో అలరించనున్నారు. అలాగే ఇటీవల జరిగిన క్రీడలలో విజేతలకు బహుమతులు అందజేస్తారు.

● అందని సూపర్‌స్పెషాలిటీ వైద్యం

ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పడి పదేళ్లు పూర్తయినా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు మాత్రం అందనంటున్నాయి. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న వైద్య కళాశాలలు మినహా మిగిలిన 11 వైద్య కళాశాలల్లో సూపర్‌స్పెషాలిటీ వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జీజీహెచ్‌లో 750 పడకలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 230 మంది వైద్య నిపుణులు ఉన్నారు. అయినా సూపర్‌స్పెషాలిటీ వైద్య చికిత్సలు అందుబాటులో లేవు. కనీసం ఎమ్మారై, సిటీస్కాన్‌లు తీసేందుకు ఒకేఒక్క రేడియాలజిస్ట్ అందుబాటులో ఉన్నారు. ఇక్కడ ఐదుగురు రేడియాలజిస్టుల అవసరం ఉంది. అలాగే, గుండె సంబంధిత విభాగానికి వైద్య బృందం కరువయ్యింది. న్యూరాలజీ విభాగంలో గతంలో ఇద్దరు న్యూరాలజీ ఫిజీషియన్లు ఉండగా ప్రస్తుతం ఒక్కరు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఆయన కూడా మంగళ, శుక్రవారాలు మాత్రమే ఓపీలో ఉంటారు. ప్రతి రోజూ ఓపీకి వస్తున్న వ్యాధిగ్రస్థులకు తిప్పలు తప్పడం లేదు. కిడ్నీ సంబంధిత వైద్యుల నియామకమే జరగలేదు. యూరాలజీ విభాగానికి ఒక వైద్యుడే దిక్కు అయ్యారు.

అమాత్యులు స్పందిస్తేనే

ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని పలు సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రధానంగా సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు, పీజీ సీట్ల పెంపు ప్రతిపాదనలు పంపినా ప్రయోజనం ఉండటం లేదు. ఈ విషయాలను జీజీహెచ్, వైద్యకళాశాల అధికారులు జిల్లా మంత్రుల దృష్టికి తీసుకు వెళ్లి తద్వారా ముఖ్యమంత్రి ద్వారా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే ఎన్‌ఎంసీ ద్వారా అనుమతులు తెప్పించాల్సి ఉంది.

● అంతా గోప్యం

మరోవైపు ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించే ఈ కార్యక్రమమైనా ప్రజల్లోకి వెళితేనే సార్థకత చేకూరుతుంది. అయితే, ఇక్కడ మాత్రం అధికారులు గోప్యత పాటిస్తున్నారు. ఏ కార్యక్రమమైనా మీడియాకు సమాచారం ఇవ్వడం లేదు. పట్టుబట్టి అడిగితే మొక్కుబడి సమాచారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.

పీజీ సీట్ల కోసం కృషి చేస్తున్నాం



ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆశించిన స్థాయిలో పీజీ సీట్లు సాధించేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నాం. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కొన్ని సమస్యలు ఉన్నాయి. శస్త్రచికిత్సలు ఎక్కువగా చేయాల్సి ఉంటుంది. అలాగే కొన్ని వైద్య పరికరాలు అవసరమవుతాయి. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని ఎన్‌ఎంసీ పీజీ సీట్లు మంజూరు చేస్తుంది. ఇందుకోసం జిల్లాలోని మంత్రులను, ఇతర ప్రజాప్రతినిధులను కలవనున్నాము.

- డాక్టర్ గోవింద్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్

పట్టపు కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి

● టీడీపీ నేత బీద రవిచంద్ర



ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, అబ్దుల్ అజీజ్, బీద రవిచంద్రకు వినతిపత్రం ఇస్తున్న మత్స్యకార సమితి నేతలు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 3 : ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ అగ్రనేతలతో మాట్లాడి పట్టపు కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మత్స్యకార నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీద మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక 2016లో మత్స్యకారులకు అప్కాబ్ చైర్మన్ ఇచ్చిన ఘనత టీడీపీదన్నారు. తీర ప్రాంతాల నుంచి వచ్చిన వాడినని, జిల్లాలో హార్బర్ ఏర్పాటు చేసేందుకు యుద్ధం చేసి రూ.238 కోట్లు మంజూరు చేయించానని చెప్పారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మత్స్యకారులకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పట్టపు కార్పొరేషన్ ఏర్పాటుపై శుక్రవారం మంత్రులు నారాయణ, లోకేష్‌తో చర్చిస్తానని చెప్పారు. కాగా అంతకు ముందు పట్టపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మత్స్యకార సమితి నేతలు ప్రశాంతి రెడ్డికి, అజీజ్‌కు, బీద రవిచంద్రకు వినతిపత్రం అందచేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



రామసుబ్బారెడ్డి మృతదేహం

వింజమూరు, అక్టోబరు 3: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన పంచాయతీ పరిధిలోని బొమ్మ రాజుచెరువు గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కడపజిల్లా పెండ్లిమర్రి గ్రామానికి చెందిన కె రామసుబ్బారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు వీపీసీ విండోస్ సంస్థకు చెందిన వారు. కడప నుంచి కావలి పట్టణంలోని షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్‌కు కారులో వెళ్లి తమ పనులను చూసుకుని స్వగ్రామమైన కడపకు తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో బొమ్మరాజుచెరువు గ్రామ సమీపానికి రాగానే దారికి అడ్డంగా వస్తున్న కుక్కలను తప్పించబోయి కంకర గుట్టపైకి ఎక్కి కారు బోల్తాపడింది. దీంతో రామసుబ్బారెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, కారు నడుపుతున్న శ్రీకాంత్‌రెడ్డికి స్వల్పగాయాలు అయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

కలువాయి, అక్టోబరు 3 : స్థానిక విద్యుత్ శాఖ కార్యాయలంలో శుక్రవారం ఉదయం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు డిస్కం గూడూరు డివిజన్ ఏఈ కెవి నరేంద్రరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సమస్యలపై వినియోగదారులు రాత పూర్వకంగా ఫిర్యాదులు అందజేయాలని ఆయన కోరారు.

పిడుగుపాటుకు రెండు పాడి గేదెల మృతి

● రూ.1.5 లక్షలు నష్టపోయిన రైతు అంకయ్య



మృతిచెందిన గేదెలతో పాడిరైతు అంకయ్య

జలదంకి, అక్టోబరు 3 : సోమవరప్పాడులో బుధవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షంలో పిడుగుపడి రైతు అంకయ్యకు చెందిన రూ.150లక్షలు విలువ చేసే రెండు పాలిచ్చే పాడిగేదెలు మృత్యువాతపడ్డాయి. అలాగే కొత్తపాలెం టీడీపీ నేత గునుపాటి వెంకటరమణారెడ్డి ఇంటి శ్లాబు పిట్టగోడ స్వల్పంగా ధ్వంసం అయ్యింది. ఈ సమయంలో వీచిన బలమైనగాలులకు విద్యుత్‌స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పాడిగేదెలు కోల్పోయిన రైతు అంకయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు తెలిపారు.

గోల్డ్ స్కీమ్ పేరుతో టోకరా

● నిందితుడిపై కేసు నమోదు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) అక్టోబరు 3: గోల్డ్‌స్కీమ్‌లో నగదు చెల్లించండి... బోనస్‌తోపాటు కలిపి కట్టిన నగదుకు బంగారం ఇస్తామంటూ ఆఫర్ పెట్టారు. ఇంకేముంది.. పలువురు గోల్డ్‌స్కీమ్‌లో నగదు కట్టారు. గడువు ముగిశాక తర్వాత బంగారం అడిగితే చేతులెత్తేశారు. చేసేది లేక బాధితులు నగరంలోని చిన్నబజారు పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల కథనం మేరకు, రామ్మూర్తినగర్‌లో రిషిత కుటుంబం నివాసం ఉంటోంది. ఆమెకు కాపువీధిలోని ఓ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో పనిచేస్తున్న మహిళ స్నేహితురాలు. ఆమె ద్వారా బంగారు వ్యాపారి వెంకట సునీల్‌కుమార్ పరిచయం అయ్యాడు. తాను గోల్డ్‌స్కీమ్ నిర్వహిస్తున్నానని, నెలకు రూ.5 వేలు చొప్పున 11 నెలలు చెల్లిస్తే 12వనెలలో రూ.5వేలు బోనస్ కలిపి బంగారు ఆభరణం ఇస్తానని సునీల్‌కుమార్ ఆమెను నమ్మించాడు. దీంతో రిషితతోపాటు ఆమెకు తెలిసిన పలువురు స్కీమ్‌లో నగదు కట్టారు. గోల్డ్ స్కీమ్ కాలపరిమితి ముగిసినా సునీల్‌కుమార్ బంగారు ఆభరణాలు ఇవ్వకపోవడంతో బాధితులు నిలదీశారు. దీంతో అతను చెల్లని చెక్కులు ఇచ్చాడు. బాధితులు ఇటీవల గట్టిగా నిలదీయడంతో సునీల్ వారిని అసభ్యకర పదజాలంతో దూషించడమే కాకుండా, దౌర్జన్యం చేశాడు. ఈ మేరకు బాధితులు గురువారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సునీల్‌కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలి

కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 3 : గుర్తింపు పొంది న రాజకీయపార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమిచుకోవాల ని కలెక్టర్ ఆనంద్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఈ నెల 29న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురిస్తామని చెప్పారు. వాటిపై నవంబరు 28 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. డిసెంబరు 24లోగా అభ్యంతరాల ను పరిశీలించి జనవరి 6న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని తెలిపారు. సమావేశంలో టీడీపీ నుంచి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, వైసీపీ నుంచి మురళీధర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి సుధాకర్, బీజేపీ నుంచి బీ శ్రీనివాస్, బీఎస్పీ నుంచి బీ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	123
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	222
స్కిన్‌లెస్	248
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7297
వెండి కిలో ధర	రూ. 93,400
వెండి ఒక గ్రాము	రూ. 96.40

వీఎస్‌యూ, కోవూరు, ఆత్మకూరులో నేడు మెగా జాబ్ మేళా

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 3: జిల్లా ఉపాధి కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్, సీడప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కోవూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్, కాకుటూరులోని వీఎస్‌యూలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తిగల యువకులు జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగాలు పొందాలన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ, డిప్లమో, ఐటీఐ చదివినవారు అర్హులని, పాల్గొనేవారు ఆధార్‌కార్డ్ జెరాక్స్, బయోడేటా తీసుకురావాలని ఆయన తెలిపారు.

బినామీల సంగతేంటి?

● 12 మున్సిపల్ భవనాల్లో 54 మంది గుర్తింపు
● ఖాళీ చేయాలని తొలుత నోటీసులు
● ఆపై చూసీచూడనట్లు వదిలేసిన రెవెన్యూ అధికారులు
● మారుఅద్దెలతో సొమ్ము చేసుకుంటున్న వేలందారులు



ఓ దుకాణాన్ని బినామీ షాపుగా గుర్తించి తాళం వేస్తున్న కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు (ఫైల్)

నెల్లూరు(సిటీ),అక్టోబరు 3: నగర పాలక సంస్థకు మున్సిపల్ భవన సముదాయాల నుంచి రావాల్సిన ఆదాయం దారిమళ్లుతోంది. విషయాన్ని గ్రహించిన కూటమి ప్రభుత్వం నెల్లూరులో ఆకస్మిక దాడులు నిర్వహించి, బినామీలను గుర్తించింది. వారంతా ఖాళీ చేయాలని అధికారులు ఆదేశాలిచ్చారు. ఆపై చూసీచూడనట్లు వదిలేశారు. ఈ తంతు ఆగస్టు 28న నిర్వహించారు. అయితే బినామీలపై ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ ఎస్ఎంసీలోని రెవెన్యూ విభాగం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 12 భవనాల్లో 54 దుకాణదారులను బినామీలను గుర్తించిన అధికారులు వారందరికీ నోటీసులతో సరిపెట్టారు. దీని వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నెల్లూరులోని ఏసీ సెంటర్‌తోపాటు గాంధీబొమ్మ కూడలి, స్టోన్‌హౌస్‌పేట, సుబేదార్‌పేట, చిన్నబజార్, మద్రాసుబస్టాండ్, ట్రంకురోడ్డు ప్రాంతాల్లో నగర పాలక సంస్థకు 12 భవన సముదాయాలు ఉన్నాయి. వీటిల్లో 254 దుకాణాలు ఉండగా, వీటిని బహిరంగ వేలం ద్వారా అద్దెలకు ఇచ్చారు. 25 ఏళ్ల పాటు వేలందారులకు అప్పగిస్తూ, ప్రతీ రెండేళ్లకు రెన్యూవల్ చేస్తూ అద్దెలో 33.5 శాతం పెంచుకుంటుపోతున్నారు. ఇదంతా చట్టప్రకారం జరిగే ప్రక్రియ. వేలంలో దుకాణాలను దక్కించుకున్న వ్యక్తి బినామీలకు అప్పగించి భారీగా ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నారు. గుడ్‌విల్ కింత ఒక్కో షాపునకు రూ.5 నుంచి 15 లక్షల వరకు వసూలు చేస్తున్న వేలందారులు ఎస్ఎంసీకి అతి తక్కువ అద్దె చెల్లిస్తున్నారు. ఈ వ్యవహారం పై ఫిర్యాదులుందుకున్న కూటమి ప్రభుత్వం ఆగస్టు 28న 12 భవనాల్లో ఏకకాలంలో ఆకస్మిక దాడులు చేపట్టింది. 254 షాపుల్లో 54 బినామీల పేరిట నడుస్తున్నట్లు గుర్తించింది. ఆ తర్వాత వారికి నోటీసులు మాత్రం ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు.

ఎందుకు వదిలేశారు ?

54 షాపులకు నోటీసు లిచ్చి ఆపై ఎలాంటి చర్యలు తీసుకో కపోవడంపై పలు అనుమానాలకు తావిస్తున్నది. బహిరంగ వేలం ద్వారా షాపులు దక్కించుకున్న వ్యక్తులు బినామీలకు అద్దెక్కిచ్చి భారీ ఆర్థిక ప్రయోజనం పొందుతున్నారు. వీరంతా అధికారుల దాడులు అనంతరం ఎవరిని కలిశారు.. ఎందుకు కలిశారు.. అధికారులు తదుపరి చర్యలు ఎందుకు తీసుకోలేదు.. అస్సలేం జరిగిం ది..? అన్నది చర్చనీయాంశమైంది.

నేటి నుంచి వీఎస్‌యూలో ఐసెట్ స్పాట్ అడ్మిషన్లు

వెంకటాచలం, అక్టోబరు 3: స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం నుండి ఐసెట్ స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని వీఎస్‌యూ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ హనుమారెడ్డి, డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎస్‌యూలోని పీజీ కళాశాలతోపాటు కావలి పీజీ సెంటర్‌లో ఐసెట్ స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందుటకు ఈఏడాది క్వాలిఫై అయిన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. వీఎస్‌యూలోని పీజీ కళాశాలలో ఎంబీఏ, ఎంబీఏ ట్రావెల్ అండ్ టూరిజం మేనేజిమెంట్, మాస్టర్ ఆఫ్ లాజిస్టిక్ అండ్ సప్లైచైన్ మేనేజిమెంట్, ఎంసీఏ, కావలి పీజీ సెంటర్‌లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. స్పాట్ అడ్మిషన్స్‌కు వచ్చే విద్యార్థులు తప్పకుండా ధ్రువీకరణ పత్రాలు, సర్టిఫికెట్స్ తీసుకురావాలన్నారు. మరింత సమాచారం కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోనైనా, 9441599597, 9989353455 ఫోన్ నెంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

ఐఎంఏ జిల్లా అధ్యక్షుడిగా అమరేంద్రనాథ్ రెడ్డి



నెల్లూరు (వైద్యం) అక్టోబరు 3 : ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి నియమితులయ్యారు. గురువారం కమిటీ సభ్యులు ఆయన్ను ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు ఐఎంఏ అధ్యక్షుడిగా ఏసీఎస్ రెడ్డి ఉండగా, ఆయన స్థానంలో డాక్టర్ అమరేంద్ర ఎన్నికయ్యారు. ఏడాదిపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. అమరేంద్రనాథ్ ప్రస్తుతం జిల్లాలోని రామతీర్థం పీహెచ్‌సీ వైద్యులుగా పనిచేస్తున్నారు. ఆయన ఎంపిక పట్ల పలువురు వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.కాగా ఐఎంఏ భవనం చైర్మన్‌గా డాక్టర్ రాము ఎంపికయ్యారు.

రేపు, ఎల్లుండి బస్సు పాసుల సేవలుఉండవు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆర్టీసీ నెల్లూరు-2 వ డిపో పరిధిలోని పీఎస్‌ఆర్ బస్‌స్టేషన్‌లో బస్ పాసు కౌంటర్ శని, ఆదివారాల్లో అందుబాటులో ఉండదని డీఎం శివకేశవయాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. బస్సుపాసు సాఫ్ట్‌వేర్ మైగ్రేషన్ కారణం గా సేవలు తాత్కాలికంగా లభించవని, ఈ విష యాన్ని ప్రయాణికులు గమనించాలని ఆయ న కోరారు.

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

● ఏపీఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు పద్మావతి



రికార్డులు పరిశీలిస్తున్న ఇంటర్‌బోర్డు అధికారులు

నెల్లూరు (విద్య), అక్టోబరు 3 : దసరా సెలవుల్లో విద్యాసంస్థల నిర్వాహకులు తరగతులు నిర్వహించవద్దని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఏపీఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు పద్మావతి హెచ్చరించారు. నెల్లూరులో ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో గురువారం ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ (ఏపీఎస్‌సీపీసీఆర్) సభ్యురాలు బత్తుల పద్మావతి, ఆర్‌ఐవో డాక్టర్ ఆదూరు శ్రీనివాసులతో కలిసి శ్రీచైతన్య, విశ్వసాయి కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇంటర్‌బోర్డు ఈనెల 3 నుంచి 13వతేదీ వరకు సెలవులు ప్రకటించిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలను లెక్క చేయకుండా తరగతులు నిర్వహించడం ఏమిటని ఆయా యాజమాన్యాలను ఆమె ప్రశ్నించారు. సెలవుల్లో విద్యార్థులను ఇబ్బందులు పెట్టేలా ప్రవర్తిస్తే సహించేది లేదన్నారు. ఆర్‌ఐవో శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటికే అన్ని కళాశాల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి సెలవుల్లో తరగతులు నిర్వహించరాదని ఆదేశించామన్నారు. అయినా కూడా ప్రభుత్వ నిబంధనలు అమలు చేయకుండా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం కళాశాలల ప్రతినిధులతో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో జీసీడీవో మమత, ఐసీడీఎస్ ఆఫీసర్ సమత, ఇంటర్‌బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

● ఏఐఎస్ఎఫ్ ఆందోళన



ఇంటర్‌బోర్డు అధికారికి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నెల్లూరు (విద్య), అక్టోబరు 3 : ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని ఆందోళన చేస్తూ నగరంలోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో గురువారం సూపరింటెండెంట్‌కి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్‌షరీఫ్ మాట్లాడుతూ ఇంటర్‌బోర్డు అధికారులు యాజమాన్యాల చేతుల్లో కీలుబొమ్మలా మారడంతోనే జిల్లాలో ఈ పరిస్థితి నెలకొన్నదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తరగతులు నిర్వహించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు శరణ్, వంశీ, హనీష్, స్వరూప్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో...

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని పలు జూనియర్ కళాశాలల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారి దృష్టి సారించి సెలవుల్లో తరగతులు నిర్వహించే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.సునీల్, నేతలు వాసిమ్, పూజిత్, హర్ష, చరణ్, లోకి, మధు తదితరులు పాల్గొన్నారు.





పురస్కారాలు అందుకుంటున్న చిరంజీవి యువత, విజయభాస్కర్ బృందం

రెడ్‌క్రాస్‌లో రక్తనిధికి ప్రత్యేక గుర్తింపు

● కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ● మోటివేటర్లకు పురస్కారాలు

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 3 : ఇండియన్ రెడ్‌క్రాస్ 14 విభాగాలతో సేవలు అందిస్తుందని, అందులో రక్తనిధికి ప్రత్యేక గుర్తింపు ఉందని రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం రెడ్‌క్రాస్‌లో జాతీయ స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమం జరిగింది. ఎక్కువసార్లు రక్తదానం చేసిన సంస్థలకు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. రెడ్‌క్రాస్‌లో కేన్సర్ ఆసుపత్రి, రక్తనిధి, తలసీమియా, దివ్యాంగుల కేంద్రాలకు మంచి గుర్తింపు ఉందన్నారు. జిల్లాలో రక్తం నిల్వల కొరత ఉన్నందున, యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఇంతమంది రక్తదాన మోటివేటర్లు సమావేశానికి రావటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 2500కు పైగా రక్తదానం చేయించిన చిరంజీవి యువత, విజయభాస్కర్ బృందాలకు ఈ సందర్భంగా పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్ సుధీర్‌నాయుడు, రాష్ట్ర కమిటీ సభ్యులు డాకారపు రవిప్రకాశ్, జిల్లా కమిటీ సభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్, కలికి శ్రీహరిరెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, దివ్యాంగుల కేంద్రం కో-కన్వీనర్ బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష

● ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నపూర్ణమ్మ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 3: కలిగిరి మండలం రావులకొల్లు ఆశావర్కర్ విజయమ్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ శుక్రవారం నుంచి కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ పేర్కొన్నారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. స్థానిక సర్పంచి మాట విని అధికారులు మూడు నెలల క్రితం అక్రమంగా ఆశాకార్యకర్తను తొలగించటం దారుణమన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, డీఎంహెచ్‌వో దృష్టికి కూడా తీసుకెళ్లామని, అయినా న్యాయం జరగలేదన్నారు. ఆశావర్కర్‌ను విధుల్లోకి తీసుకునేంతవరకు నిరాహారదీక్ష కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంచలనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

దోలేంద్ర ప్రసాద్‌కు మాతృవియోగం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 3 : నెల్లూరులోని 'జమీన్ రైతు' పత్రిక అధినేత దోలేంద్ర ప్రసాద్ తల్లి లలితమ్మ గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. శుక్రవారం సాయంత్రం మాగుంట లే అవుట్‌లోని తమ స్వగృహం నుంచి అంతిమయాత్ర జరుగుతుందని కుటుంబసభ్యులు తెలిపారు.

వెలుగునివ్వని ఈ-నేత్రం

● మూతపడిన కేంద్రాలు
● కంటి రోగుల అవస్థలు

ఉదయగిరి రూరల్/పొదలకూరు, అక్టోబరు 3 : గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న ముఖ్యమంత్రి ఈ-నేత్ర కేంద్రాలు జిల్లాలో మూతపడ్డాయి. 2018, ఫిబ్రవరి 2న టీడీపీ హయాంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఐదు చోట్ల ప్రారంభించారు. కాగా గత నెల 4వ తేదీ నాటికి రాష్ట్ర ప్రభుత్వం, అపోలో వైద్యశాల మధ్య కుదిరిన ఒప్పంద గడువు ముగిసింది. దీంతో ఆ కేంద్రాలు మూతపడ్డాయి. ఉమ్మడి జిల్లాలోని బుచ్చి, పొదలకూరు, వెంకటగిరి, ఉదయగిరి, నాయుడుపేట ప్రాంతాల్లో ఈ-నేత్ర కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఒక్కో కేంద్రంలో 30 నుంచి 50 మంది కంటి రోగులకు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించేవారు. అవసరమైనవారికి కంటి అద్దాలు పంపిణీ చేయడంతోపాటు శస్త్రచికిత్సకు సిఫారసు చేసేవారు. ఇప్పటివరకు ఆయా కేంద్రాల్లో 1,43,636 మందికి పరీక్షలు నిర్వహించారు. దీంతోపాటు సుమారు 50 వేల మందికి కంటి అద్దాలు పంపిణీ చేసి, 10 వేలమందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. గ్రామీణులకు ఎంతో ఉపయోకరంగా ఉన్న ఈ కేంద్రాలు మూతపడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే, విషయం తెలియక ప్రజలు కేంద్రాలకు వెళ్లి తలుపులు మూసి ఉండడంతో వెనుతిరుగుతున్నారు. కంటి చికిత్సకు ప్రైవేటు వైద్యశాలల్లో ఓపీ రూ.300 అవుతుంది. కళ్లద్దాలు కావాలంటే మరో రూ.3 వేలు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో పేదలపై భారం పడనుంది. కూటమి ప్రభుత్వమైనా ఈ-నేత్ర కేంద్రాలను పునఃప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ-నేత్రం జిల్లా మేనేజరు సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, అపోలో వైద్యశాల మధ్య కుదిరిన ఒప్పందం ముగియడంతోనే కేంద్రాలను మూసినట్లు తెలిపారు. అయితే, ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున త్వరలో పునఃప్రారంభించేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.



పొదలకూరు సీహెచ్‌సీలో తాళం వేసి ఉన్న కంటి పరీక్షల కేంద్రం



ఉదయగిరిలో మూతపడ్డ సీఎం ఈ-నేత్ర కేంద్రం

స్కానింగ్ సెంటర్ల తనిఖీ


స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ప్రియంవద

కందుకూరు, అక్టోబరు 3: పట్టణంలోని వివిధ ప్రవేటు హాస్పిటల్స్‌లో నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్లను గురువారం జిల్లా ఉప వైద్యాధికారి ప్రియంవద ఆకస్మికంగా తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పరీక్షలు చేసినవారికి, అడిగిన వారికి కూడా చట్టపరమైన శిక్షలు విధించబడతాయని హెచ్చరించారు. రికార్డులను పరిశీలించారు. ప్రతి నెల స్కానింగ్ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి ప్రతినెల 2వ తేదిన జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయానికి నివేదికలను పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య శాఖ అధికారి షేక్ ఆరిఫుల్లా పాల్గొన్నారు.

నూకసాని ప్రమాణ స్వీకారానికి తరలిరండి

లింగసముద్రం, అక్టోబరు 3: ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ జడ్పీ ఛైర్మన్, ఒంగోలు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ ప్రమాణ స్వీకానికి విజయవాడకు తరలి రావాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బోడి సురేష్, నేతలు చిట్టిబోయిన సుధాకర్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న ఉదయం ఆటోనగర్ ఏపీ టీడీపీ కార్యాలయంలో కార్యక్రమం జరు గనుంద న్నారు.

రెండు ట్రాక్టర్లు, ఎక్సకవేటర్ స్వాధీనం

కావలి, అక్టోబరు 3: సర్వాయపాలెం పంచాయతీ అల్లిగుంటపాలెంకు చెందిన రెండు మట్టి ట్రాక్టర్లు, ఎక్సకవేటర్‌ను గురువారం మధ్యాహ్నం పోలీసులు స్వాధీనం చేసుకుని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల వద్ద పశువులు కట్టేసేందుకు తువ్వమట్టి మేరవ తరలిస్తున్నట్లు తమకు ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. మామూళ్లు ఇచ్చిన వారిని వదిలేసి మిగతా వారిని కొందరు పట్టుకుంటుండగా మరి కొందరు రాజకీయంగా ఫిర్యాదులు చేసిన వారివి పట్టుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కలిగిరి, అక్టోబరు 3: స్థానిక ఓరియన్ ఇంగ్లిష మీడియం పాఠశాలలో గురువారం ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఉదయగిరి నియోజకవర్గ శాఖ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఉత్తమ ఉపాధ్యాయులు అరుణ, జే.వీ.రమేష్‌లతో పాటు పలువురు విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానించారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో నేతలు ఊసా మాల్యాద్రి, మంజాన్‌రావు, నిశ్శంకర సురేష్, కె.దిలీప్‌కుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

తీరప్రాంత రోడ్లను పునర్నిర్మించాలని నిరసన

కావలి, అక్టోబరు 3: కృష్ణపట్నం పోర్టు నుంచి విశాఖ వరకు జరుగుతున్న గ్యాస్ పైపులైన్ల నిర్మాణంలో భాగంగా ధ్వంసమైన రోడ్లను పునర్నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి తెలిపారు. గురువారం వారు కావలి ఆర్డీవో కార్యాలయం ఎదుట తీరప్రాంత ప్రజలతో కలసి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంచిపాక రత్నం, చెరుకూరు జనార్ధన్, జ్యోతి జాన్, పీ శ్రీనివాసులు, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఉరుములతో కూడిన మోస్తరు వర్షం

బిట్రగుంట, అక్టోబరు 3: బోగోలు మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. వారంరోజులుగా వేసవిని తలపించే ఎండ వేడిమికి తల్లడిల్లి పోతున్న ప్రజలకు కాస్త ఉపసమనం దొరికింది. వర్షపు జల్లులతో వాతావరణం చల్లపడింది.

పోరంబోకు భూముల ఆక్రమణ

మర్రిపాడు, అక్టోబరు 3: ప్రభుత్వ భూములతో పాటు పోరంబోకు భూములు సైతం ఆక్రమణకు గురవుతున్నాయి. కదిరినేనిపల్లి రెవెన్యూలో గత వారం రోజులుగా ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. సర్వే నెంబర్ 67లో సమూరు 20ఎకరాల మేతపోరంబోకు భూమిని ఆక్రమించి జామాయిల్ మొక్కలు నాటారు. దానితోపాటు సర్వే నెంబరు 1లో 803 ఎకరాలు మేతపోరం బోకు భూమి ఉండగా అందులో ప్రస్తుతం 25ఎకరాలు జామాయిల్ మొక్కలు నాటేందుకు గత రెండు రోజులుగా కంపచెట్లను తొలగించి చదును చేశారు.

భగ్గుమంటున్న నిత్యావసరాలు

- ధరలన్నీ ఆకాశంలోనే.. • చింతపండు కిలో రూ.200
- వంటనూనె లీటరుకు రూ.21 వరకు పెరుగుదల
- సామాన్యులపై ఆర్థిక భారం



ఆత్మకూరు, అక్టోబరు 3: నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయి. ముఖ్యంగా నూనె, ఉల్లిపాయలు, చింతపండు, కందిపప్పు, పెసరపప్పు ధరలు మండిపోతున్నాయి. ఇక పప్పు, సాంబరు, రసం వంటి వాటిలో తప్పని సరిగా వినియోగించే చింతపండు ధర డబుల్‌సెంచరీకి చేరింది. ప్రస్తుతం చింతపండు కిలో రూ.200ల వరకు ఉంది. కిలో కందిపప్పు కేజీ 175, పెసరపప్పు రూ.130, మినపప్పు కూ. రూ. 125 నుంచి రూ. 185 వరకు విక్రయిస్తున్నారు. మరోపక్క వంట నూనె ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. సన్‌ఫ్లవర్‌ఆయిల్ లీటరు ధర రూ131లకు చేరింది. లీటరు ప్యాకెట్‌పై ఒకేసారి ఏకంగా రూ. 21 వరకు ధర పెరిగింది. ఇలా పలు రకాల నిత్యావసరాలపై ధరల మోత మోగుతుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు. ఇక చిల్లరదుకాణాల్లో అయితే ఉల్లి ధరలు మరింత మండిపోతున్నాయి. ప్రస్తుతం కర్ణాటక, తమిళనాడు, కర్నూల్, గొల్లప్రోలు ఉల్లిపాయలకు ఇది అన్‌సీజన్ కావడంతో వాటి దిగుమతులు తగ్గి మార్కెట్‌లో ఆయా ప్రాంతాల ఉల్లి కనిపించే పరిస్థితి లేదు. దాంతో ఉల్లి ధర మరింత పెరిగి కంటతడి పెట్టించనున్నాయి.

• కాగుతున్న వంటనూనెలు



వంట నూనె ధరలు సలసల కాగుతున్నాయి. ఫ్రీడమ్, న్యాచురల్, గోల్డ్‌డ్రాఫ్, సన్‌ఫ్లవర్ వంటి అన్ని రకాల ఆయిల్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. లీటరుకు రూ. 21 వరకు ధర పెరగడంతో సాధారణ, మధ్యతరగతిప్రజలకు భారంగా మారింది. క్యారెట్, క్యాప్సికమ్, టమోటా వంటి కూరగాయల ధరలు చుక్కలంటుతున్నాయి.. కిలో టమోటా రూ.40 నుంచి రూ.50ల వరకు దిగిరావడం లేదు. నిత్యవసరాల ధరలు భగ్గుమనడంతో సాధారణ, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

• బ్లాక్‌మార్కెట్ బూచి

ఉల్లిపాయలు, చింతపండు, నూనె వంటి కొన్ని సరుకుల ధరలు అనూహ్యంగా పెరగడానికి బ్లాక్‌మార్కెట్ శక్తులే కారణమనే ఆరోపణలు చిరువ్యాపారుల నుంచి వస్తున్నాయి. ఈ విషయపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఏ దిక్కూ లేని వాళ్లం... పింఛన్ ఇప్పించండి


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న మత్స్యకార మహిళలు

బిట్రగుంట, అక్టోబరు 3: సదువు కోలేదు. భర్తలేదు దినసరి కూలీ ఉంటే సరే.. లేకుంటే పస్తులుంటూ ఒంటరి జీవితం సాగిస్తున్నాం నాకు పింఛన్ ఇచ్చి ఆదుకోండి సారూ అంటూ తీరప్రాంత మత్స్యకార మహిళలు గురువారం ఎంపీడీవో వెంకటసుబ్బారావును కలిసి వినతిపత్రం అందజేశారు. వీరి వెంట బోగోలు మండలం సీఆర్‌పాలెం పంచాయతీ తాటిచెట్లపాలెం సామాజిక కర్త ప్రళయ కావేరి భాగ్యలక్ష్మి ఉన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి వీరికి న్యాయం జరిగేలా చూస్తానని ఎంపీడీఓ చెప్పారు.

మీ సేవ, ఈసేవ సర్వీసుదారులకు న్యాయం చేయండి

నెల్లూరురూరల్, అక్టోబరు 3: వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా అణచి వేతకు గురైన మీసేవ, ఈసేవ సర్వీ సుదారులకు న్యాయం చేయాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయనకు వారు వినతిపత్రం అందించారు. అసోసియేషన్ నేత అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకునే అవకాశం మీసేవ, ఈసేవ సర్వీసుదారులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 2014-19 టీడీపీ హయాంలో తామే ఇవన్నీ చేసుకుని జీవనం గడుపుతున్నా మన్నారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి యంత్రాలు, షాపులు, సిబ్బందిని ఏర్పాటు చేసు కున్నామని తెలిపారు. జగన్ సర్కారు వచ్చాక అవన్నీ తీసేసి సచివాలయాలకు అప్పగించారని, దీంతో తామంతా ఆర్థికంగా నష్టపోయి ఉపాధిని కోల్పోయామన్నారు.

ప్రశాంతంగా టెట్ ప్రారంభం

- నిలువ నీడలేక ఎండలోనే నిరీక్షించిన కుటుంబసభ్యులు


కావలి: విట్స్ పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న అభ్యర్థుల కుటుంబ సభ్యులు


బిట్రగుంట: అభ్యర్థుల హాల్ టికెట్లను తనిఖీ చేస్తున్న పోలీసులు

కావలి టౌన్, అక్టోబరు 3: విశ్వోదయా ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబుల్ టెస్ట్ (ఏపీ టెట్) ప్రశాంతంగా జరిగింది. పరీక్షలు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు తొలి విడతగా మధ్యాహ్నం 2:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండోవిడతగా పరీక్షలు నిర్వహించారు. గంట ముందే పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలని నిర్వాహకులు సూచించడంతో అభ్యర్థులు ఉదయం 8-30 గంటలకు మధ్యాహ్నం 2గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. దూరాభారం నుంచి అభ్యర్థులకు తోడుగా వచ్చిన కుటుంబ సభ్యులు మూడున్నర గంటల పాటు నిలువ నీడలేక ఎండలో పడిగాపులు కాశారు. ఉదయం 130మంది పరీక్షలు రాయాల్సివుండగా 117మంది, మధ్యాహ్నం 130మందిలో 114మంది పరీక్ష రాసినట్లు పర్యవేక్షణాధికారి గా వ్యవహరించిన డిప్యూటీ డీఈవో రఘురామయ్య తెలిపారు. బోగోలు మండలం కడనూతలలోని ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఉదయం 110మందిలో 96 మంది, మధ్యాహ్నం 110మందిలో 103 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

బిట్రగుంట: కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో గురువారం టెట్ పరీక్షలు (టీచర్స్ అర్హత పరీక్షలు) ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు మహిళలలకు జరిగిన పరీక్షలకు 110 మందికి 96 హాజరైయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పురుషులకు జరిగిన పరీక్షలో 110 మందికి 103 మంది హాజరైయ్యారు. స్థానిక ఎస్ఐ భోజ్యా, ఏఎస్ఐ సుధాకర్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



అధికారుల 'మొద్దు' నిద్ర

కొత్తపల్లి రోడ్డు మార్జిన్‌లో వేసిన మామిడి మొద్దులతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మామిడి తోటలు కొట్టేసిన తరువాత అందులోని మొద్దులు తెచ్చి రోడ్డు అంచున వేశారు. రాత్రిపూట ఎదురుగా వాహనాలు వచ్చినపుడు రోడ్డు అంచున ఉన్న వాహనాలు కన్పించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలు జరిగితేగాని అధికారులు పట్టించుకోరా అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు సమీపంలో ఉన్న మొద్దులను తొలగించేందకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- కావలి రూరల్

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి : సీపీఎం


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

కందుకూరు, అక్టోబరు 3: కందుకూరు నుంచి కొండముడుసుపాలెం మీదగా వెళుతున్న జాతీయ రహదారిపై ప్రమాదాలను అరికట్టేందుకు ఫైఓవర్ లేదా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఎం పట్టణ నాయకుల ఆధ్వర్యంలో గురువారం సబ్ కలెక్టర్ శ్రీపూజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ఏ గౌస్ మాట్లాడారు. కందుకూరు నుంచి గుడ్లూరు, కావలి, పెద్దపవని ప్రాంతాలకు రాకపోకలు ఎక్కువగా ఉండటం వల్ల ఎర్రవాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని సబ్ కలెక్టర్ వారికి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామూర్తి, ఎస్‌కే మున్వర్ సుల్తానా, వెంకట్రావు, ఎస్‌కే మల్లిక, ఎం.పద్మ, ఎం.రవి, రాయుడు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి


ఆత్మకూరు: మాట్లాడుతున్న ఏడీఏ

ఆత్మకూరు, అక్టోబరు 3: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఆత్మకూరు వ్యవసాయ ఉప సంచాలకులు వి దేవసేనమ్మ తెలిపారు. గురువారం మండలంలోని వెన్నవాడ, ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని పంటవీధి రైతుభరోసా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం లాభదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమాలలో మండల వ్యవసాయశాఖాధికారి కిషోర్‌బాబు, ఎన్నవాడ సర్పంచ్ జె జయలక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కె ప్రమీల, ఎంపీఈవో ఏ రేణుక, విఏఏ దీప, పలువురు రైతులు పాల్గొన్నారు.

●**కందుకూరు** : పంట వేసిన ప్రతిరైతూ తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాము సూచించారు. గురువారం కొండముడుసుపాలెం, కంచరగుంట రైతుభరోసా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ-పంట నమో దుతో రాబోవు రోజుల్లో పంట నష్టపోయిన, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, కొనుగోలు కేంద్రాలతో ధాన్యాన్ని అమ్ముకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారి డి.దనమ్మ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ ఖాసిం, సీహెచ్ వెంకట్ రాజా, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

●**లింగసముద్రం:** ప్రతిరైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి అబ్రహం లింకన్ తెలిపారు. గురువారం మాలకొండరాయునిపాలెం, వీఆర్ కోటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం గొర్రెలలో నీలి నాలుక వ్యాధి, గేదెలలో గాలికుంటు వ్యాధి ఉన్నందున సకాలంలో టీకాలు వేయించుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయకులు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు షేక్ అహమ్మద్, మార్కెటింగ్ సహాయకులు వినయ్ పాల్గొన్నారు.

●**దగదర్తి(బిట్రగుంట):** భూమిని సారవంతంగా చేసేందుకు రైతులు ముందుగా నవధాన్యాలను చల్లాలని గురువారం దగదర్తి మండలం నారాయణపురం రైతు ముగ్రికుమ్మి సురేష్ తెలిపారు. పూతకొచ్చిన 45 రోజుల తర్వాత భూమిలోకి కలయదున్ని వరి నాటుకోవాలన్నారు. విత్తనాలు వేయడం వలన వేర్లు పాకి పచ్చిరొట్ట భూమిలో కలవడంతో పొల్లం సారవంతంగా మారుతుందన్నారు. ఐదేళ్లగా 10 ఎకరాల పొలంలో రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఉపయోగపడే పనులు చేయండి

లింగసముద్రం, అక్టోబరు 3: ఉపాధిహామీ పథకం, 15వ ఆర్థికసంఘం నిధులతో గ్రామాల ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం అన్నెబోయినపల్లి, అంగిరేకులపాడులో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడం, పారిశధ్యం మెరుగులకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కార్యదర్శి షేక్ గౌస్‌బాషా, గ్రామస్థులు పాల్గొన్నారు.

రక్తదాతకు సన్మానం


జగదీష్‌ను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

అనంతసాగరం, అక్టోబరు 3: సోమశిలకు చెందిన ఉప్పలపాటి జగదీష్‌కు జిల్లా రెడ్ క్రాస్ కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. రక్తదాత వాలంటీర్డే సందర్భంగా సేవా కార్యక్రమాల్లో జగదీష్ క్రియాశీలకంగా పని చేసినందుకు గాను జిల్లా అధ్యక్షుడు పి చంద్రశేఖర్‌రెడ్డి, ఎం కోటారెడ్డి ఆయనను సత్కరించారు.

కలువాయి ఉపాధ్యాయుడికి అవార్డు

కలువాయి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు జీ పెంచలపుల్లయ్య ఉత్తమ రక్తదాన ప్రేరేపకునిగా అవార్డు అందుకున్నారు. గురువారం నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ నెల్లూరు ఛైర్మన్, ఎమ్మెల్సీ పి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- దసరా శోభతో మెరిసిపోతున్న అమ్మవారి ఆలయాలు
- విశేష పూజలు, అలంకరణలు


సీతారామపురం: నారాయణంపేటలోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో భక్తుల పూజలు


కందుకూరు: అంకమ్మ పూజకు వస్తున్న ఉభయదాతలు


బిట్రగుంట: విద్యుత్ దీపాలంకరణలో కోదండరామాలయం

కావలి టౌన్, అక్టోబరు 3: దసరా శరన్నవరాత్రోత్సవాలు గురువా రం పట్టణంలో వైభవంగా ప్రారంభం అయ్యాయి. అమ్మవారి ఆలయాల్లో ప్ర త్యేక ఏర్పాట్లు, విద్యుదీపాలంకరణలతో దసరాశోభ సంతరించుకుంది. భక్తులు పెద్దఎత్తున వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతూరు శివాలయంలో దుర్గా భ్రమరాంబ బాలత్రిపురాసుందరిదేవిగా, విష్ణాలయంలో రాజ్యలక్ష్మీ అమ్మవారు రాజ్యలక్ష్మీదేవిగా వడ్డెపాలెంలో కనకదుర్గాదేవి అమ్మవారు కనక దుర్గాదేవి అలంకరణలో, ముసునూరులో మహాలక్ష్మమ్మ స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవెంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు శ్రీరాం మాల్యాద్రి పర్యవేక్షణలో వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం అంకురార్పణ మహోత్సవం జరగ్గా భక్తులు పాల్గొని పూజలు చేశారు.

బిట్రగుంట: విశ్వనాథరావుపేట కోదండరామాలయ ఆవరణంలో వెలసిన రాజరాజేశ్వరి అమ్మవారు మొదటిరోజు బాలత్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు. రామస్వామిపాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అనంతసాగరం : సోమశిల సోమేశర్వుని ఆలయంలోని కామాక్షి అమ్మవారు త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందిచారు.


ఉదయగిరి రూరల్: పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయం, శ్రీసంతానలక్ష్మీదేవి ఆలయాల్లో అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అలాగే దుర్గంపల్లి, గండిపాళెం, అడవిపేరంటాలమ్మ తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుత్తలూరులో: గుంతబజార్‌లో ఎస్‌ఎస్‌యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేశారు. భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు బాలత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు.

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్ల మానసాదేవికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారు శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వరికుంటపాడు నాగరప్పమ్మ ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఆత్మకూరు : పట్టణంలోని సత్రం సెంటర్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కలశ స్థాపన వైభవంగా జరిగింది. అమ్మవారికి అభిషేకం, శ్రీవాసవీ అష్టోత్తర పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. అమ్మవారు భువనేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. తిరునాళ్ళతిప్ప కాశీనాయన ఆశ్రమ ఆవరణలోని దుర్గామల్లేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శివాలయంలోని అన్నపూర్ణాదేవి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపురాసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్తర బలిజవీధి జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు స్వర్ణకవచాలాంకృత జ్వాలాముఖిగా భక్తులకు దర్శనమిచ్చారు.

సంగం: స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో కలశ స్థాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం రాత్రి కామాక్షిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. ఇరిగేషన్ ఏఈ వినయ్ కుమార్ స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీరించారు. తిరుమనకొండలోని రాజరాజేశ్వరీదేవి సమేత కాశీ విశ్వేశ్వర ఆలయం, గంగమ్మ ఆలయంలో వేడుకలు ప్రారంభమయ్యాయి.


అల్లూరు: ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ

సీతారామపురం: స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాలలో, నా రాయణంపేటలోని విజయ కనకదుర్గా దేవి ఆలయంలో కలశ స్థాపనతో దస రా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని గౌరిదేవి (శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి)గా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణపే ట విజయ కనకదుర్గాదేవి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. అ నంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కందుకూరు: అంకమ్మతల్లిని ఉత్సవాల తొలిరోజు సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అలం కరించి అష్టోత్తర కుంకుమ పూజ నిర్వహించారు. పూజల్లో ఉభయ దాతలుగా కొనిజేటి రవికుమార్, అనిల్ కుమార్ బ్రదర్స్, ఇస్కాల మురళీ కృష్ణ, చక్కా బ్రహ్మయ్య, వందవాసి సుబ్బారావు, కొనిజేటి శ్రీనివాసులు వ్య వహరించారు. విఘ్నేశ్వుడికి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణవేణి తీర్థప్రసాదాలు అంద జేశారు.

అల్లూరు: స్థానిక బీసీ కాలనీలోని పోలేరమ్మకు రాత్రి ఖడ్గమాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూలతో విశిష్ట పూజలు చేశారు. కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆళ్వారు సురేష్, భాను దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

కలిగిరి: తెల్లపాడు భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఉదయం పుణ్యాహ వచనం, గణపతిపూజతో పూజతో పారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పంచాభిషేకం నిర్వహించారు. అమ్మవారు బాల త్రిపుర సుందరదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కొండాపురం: సాయిపేట అభయాంజనేయస్వామి ఆలయంలో నేటి నుండి దేవీ నవరాత్రులు జరుపుతామని ఆలయ నిర్వాహకులు ఎమ్.సుబ్బారావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తామని భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు.


కావలి పాతూరు శివాలయంలో బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో దుర్గాభ్రమరాంబాదేవి


కలిగిరి: బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భద్రకాళి అమ్మవారు


ఉదయగిరిలో శివాలయంలో బాలత్రిపురసుందరిదేవి అలంకరణలో అమ్మవారు


ఆత్మకూరులో భువనేశ్వరీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

నేటి నుంచి కేంద్రీయ విద్యాలయంలో సైన్స్ ఎగ్జిబిషన్

నెల్లూరు (విద్య), అక్టోబరు 3: ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్‌ను పురస్కరించుకుని నగరంలోని కొత్తూరులో ఉన్న కేంద్రీయ విద్యాయంలో శుక్ర,శనివారాల్లో సోషల్, సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కే శంకరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు క్లస్టర్ పరిధిలోని 9 విద్యాలయాల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులు అందచేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

రేపటి నుంచి ఫుడ్ ఫెస్టివల్

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 3: మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఈనెల 5, 6, 7తేదీల్లో నగరంలోని వీఆర్ హైస్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు సమితి రాష్ట్ర నాయకులు కొండు లక్ష్మణరావు, మేకల వెంకయ్య, ఆవుల యానాదయ్య, బెల్లంకొండ గిరీష్‌రాజు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు జార్జికురియన్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. జిల్లా ప్రజలంతా తరలిరావాలని కోరారు.

వీఎస్‌యూలో విక్షిత్ భారత్

వెంకటాచలం, అక్టోబరు 3: స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో గురువారం విక్షిత్ భారత్ 2047 సందర్భంగా వన్‌డే ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ ఆన్ ఇన్నోవేషన్ అండ్ స్టార్ట్ ఆప్ ఐడియాస్ అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ విజయ, డాక్టర్ ఎస్‌టీ సాయినాథ్, డాక్టర్ త్రివేణి, డాక్టర్ సాయిస్రవంతి తదితరులున్నారు.

వీఆర్‌వోల బాధ్యతల స్వీకరణ

మనుబోలు, అక్టోబరు 3: మండలంలోని రెండు సచివాలయాలకు గురువారం కొత్తగా నియమితులైన ఇద్దరు వీఆర్‌వోలు బాధ్యతలు చేపట్టారు. జట్లకొండూరు వీఆర్‌వోగా నెల్లూరు అర్బన్‌కు చెందిన రమేష్‌బాబును, వెంకన్నపాళెం వీఆర్‌వోగా సురేంద్రను నియమించడంతో వారు బాధ్యతలు స్వీకరించారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

మనుబోలు, అక్టోబరు 3: మండలంలో పలు పంచాయతీలకు కార్యదర్శులుగా పనిచేస్తున్న 8మంది సాధారణ బదిలీల్లో భాగంగా గురువారం బదిలీ అయ్యారు. పిడూరు కార్యదర్శి కృష్ణవేణి, కొలనుకుదురు కార్యదర్శి రేష్మాసోని, గురివిందపూడి కార్యదర్శి అనిత వెంకటాచలం మండలానికి బదిలీకాగా, వీరంపల్లి కార్యదర్శి రాజేశ్వరి పొదలకూరు మండలానికి, కాగితాలపూరు కార్యదర్శి విమల సైదాపురం మండలానికి, చెర్లోపల్లి కార్యదర్శి సుదర్శిని ఇందుకూరుపేట మండలానికి, చెరుకుమూడి కార్యదర్శి పద్మమంజుల చిట్టమూరు మండలానికి బదిలీ అయ్యారు. కాగా, బదిలీ అయిన కార్యదర్శుల స్థానాలను భర్తీచేస్తూ ఆత్మకూరు మండలం నుంచి అంకయ్యను పిడూరుకు, టీపీ గూడూరు మండలం నుంచి జయంతిని గురివిందపూడికి, వెంకటాచలం మండలం అనికేపల్లి నుంచి వై బాబును కొలనుకుదురుకు, మనుబోలు మండలం బద్దెవోలు నుంచి చెంచు ప్రసాద్‌ను జట్లకొండూరుకు, టీపీ గూడూరు మండలం నుంచి హిమబిందును కాగితాలపూరుకు, వెంకటాచలం మండలం కంటేపల్లి నుంచి ప్రసాద్‌రెడ్డిని చెర్లోపల్లికి, అనంతసాగరం మండలం నుంచి మోహన్‌కిషోర్‌ను చెరుకుమూడికి బదిలీ చేశారు.

11 నుంచి నూతన మద్యం పాలసీ

తోటపల్లిగూడూరు, అక్టోబరు 3: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీ ఈనెల 11వ తేదీ నుంచి అమలుచేస్తున్నట్లు ఇందుకూరుపేట ఎక్సైజ్ సీఐ జీవీ ప్రసాద్‌రెడ్డి గురువారం మీడియాకు సమాచారం అందించారు. ఇందుకూరుపేట మండలానికి సంబంధించి 5, తోటపల్లిగూడూరు మండలానికి 5, ముత్తుకూరు మండలానికి 8షాపులు, మొత్తం మూడు మండలాలకు కలిపి 18 షాపులను కేటాయించినట్లు తెలిపారు. ఈనెల 1నుంచి 9వ తేదీ వరకు సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అప్లికేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. 11వ తేదీ ఉదయం 8గంటలకు లాటరీ పద్ధతిలో ఎంపికచేసి, 12వ తేదీ నుంచి మద్యం షాపులు నిర్వహించుకోవచ్చని తెలిపారు. బడికి, గుడికి దూరంగా ఈ షాపులు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని తెలియజేశారు.

అజీజ్‌తో రూరల్ ఎమ్మెల్యే భేటీ

నెల్లూరు(సిటీ): రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా ఎంపికైన అబ్దుల్‌అజీజ్‌తో గురువారం నెల్లూరురూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి భేటీ అయ్యారు. ఆయన్ను నెల్లూరులోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందచేసి, తాజా రాజకీయాలపై కాసేపు చర్చించారు.



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు

జై భవానీ... జైజై భవానీ!

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ఆరంభం



కన్యకాపరమేశ్వరి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 3 : నగరంలో అమ్మవారి ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే అమ్మవారిని స్తుతిస్తూ భక్తిగీతాలు, వేదమంత్రాలతో ఆలయాలు మారుమోగాయి. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం ఆధ్వర్యంలో 1008 మంది ముత్తైదువులు పెన్నానది తీర్థాన్ని కలశాలతో స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్ స్వామి ఆధ్వర్యంలో కలశ పూజ, ప్రాణ ప్రతిష్ఠ పూజలు జరిగాయి. వాసవీ కన్యకాపరమేశ్వరిని వెండిరథంపై అలంకరించి, ప్రాణ ప్రతిష్ఠ చేసిన కలశాలతో 1008 మంది మహిళలు జై వాసవీ.. జైజై వాసవీ.. అంటూ రంగనాయకుల పేట నుంచి స్టోన్‌హౌస్‌పేట వరకు నగరోత్సవం నిర్వహించారు. ఈ ఊరేగింపులో పాల్గొన్న మహిళలందరికీ అమ్మవారి వెండి డాలర్లు అందజేశారు. భారీగా అన్న ప్రసాదం వితరణ చేశారు. సాయంత్రం మూలవర్లకు కుబేర కుంకుమ అలంకారం, ఉత్సవమూర్తికి భవానీ అలంకారం, సహస్ర దీపాలంకరణలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు కోట గురుబ్రహ్మం, కొండా ప్రవీణ్‌శంకర్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి పేగు షణ్ముఖరావు, గౌరవ సలహాదారుడు ఎంపీ ఆంజనేయులు, కమిటీ మెంబర్లు పర్యవేక్షించారు.

- దసరా నవరాత్రుల సందర్భంగా రాజరాజేశ్వరి ఆలయంలో ఉదయం సంపుటీకరణ, చండీహోమం, కలశ స్థాపన, పూజలు జరిగాయి. అమ్మవారికి చండీ అలంకారం, పూలంగిసేవ, లలితా కుంకుమార్చన జరిగాయి. భవానీలచే అమ్మవారి నామస్మరణ పూజలు జరిగాయి. సాయంత్రం ప్రత్యేక పూజల్లో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు పాల్గొన్నారు.
- మూలాపేట భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరాలయంలో సాయంత్రం కలశ స్థాపన జరిగింది. భువనేశ్వరీ అమ్మవారికి భవానీ అలంకారం జరిగింది. కార్యక్రమాలను ఉభయకర్తలు ఈవో జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.
- ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు గురువారం రాత్రి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కలశస్థాపన, విశేష పూజలు జరిగాయి. రాత్రి అమ్మవారికి రాజరాజేశ్వరి అలంకారం జరిగింది. ఉత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ వట్టూరు సురేంద్రయాదవ్, ఉభయకర్తలు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.
- విరాట్‌నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గాయత్రీ అమ్మవారికి దుర్గాదేవీ అలంకారం జరిగింది. ఉదయం అభిషేకాలు, కలశ ప్రతిష్ఠ పూజలు జరిగాయి. కార్యక్రమాలను పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం పర్యవేక్షించింది.
- మూలాపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో ఉదయం కలశస్థాపన, రాత్రి విశేష పూజలు జరిగాయి.
- ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామపురంలో మహాలక్ష్మి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ పత్తి నరసింహం, భక్తులు కోదండరామపురంలో కలశానికి పేట ఉత్సవం నిర్వహించి ప్రతిష్ఠ చేశారు. అమ్మవారికి గాయత్రి అలంకారం జరిగింది.
- నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో ఉదయం హోమాలు, కలశ స్థాపన జరిగింది. రాత్రి అమ్మవారికి బాలత్రిపుర సుందరీ అలంకారం జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ, ఆలయ పునఃనిర్మాణ కమిటీ అధ్యక్షుడు మద్దూరు సుబ్బారావులు పర్యవేక్షించారు.
- సుజాతమ్మకాలనీ అష్టలక్ష్మి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అష్టలక్ష్మి అమ్మవారికి గౌరీదేవీ అలంకారం జరిగింది. ఉమాదేవికి ప్రత్యేక అలంకారం, విశేష పూజలు జరిగాయి.
- గాంధీనగర్ కృష్ణమందిరంలో వైభవలక్ష్మికి విశేష పూజలు జరిగాయి. రాత్రి కలశ స్థాపన జరిగింది. కార్యక్రమాలను ధర్మకర్తలు, ఉభయకర్తలు పర్యవేక్షించారు.



కోదండరామపురంలో గాయత్రిగా మహాలక్ష్మి



మూలస్థానేశ్వరాలయంలో భవానీగా భువనేశ్వరి



కృష్ణమందిరంలో వైభవలక్ష్మికి ప్రత్యేక అలంకరణ

క్షేత్రస్థాయిలో పరిశీలించి ఓటర్ల జాబితా తయారీ

నగర కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ),అక్టోబరు 3 : ఓటర్ల జాబితాలో డోర్ నెంబర్ల గందరగోళానికి కళ్లెం వేసి, క్షేత్రస్థాయి పరిశీలనతో నూతన జాబితా తయారు చేస్తామని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోర్ నెంబర్ల బౌండరీగా పరిగణించి, వారే ఆ పోలింగ్ స్టేషన్‌లో ఉండేటట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చిన సలహాలతో మెరుగైన ఓటరు జాబితా తయారు చేస్తామన్నారు. అనంతరం గృహ నిర్మాణాలపై సచివాలయాల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు.



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్

మీ సేవ, ఈసేవ సర్వీసుదారులకు న్యాయం చేయండి

- టీడీపీ నేత గిరిధర్‌రెడ్డికి వినతి

నెల్లూరురూరల్,అక్టోబరు 3: వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా అణచివేతకు గురైన మీసేవ, ఈసేవ సర్వీసుదారులకు న్యాయం చేయాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయనకు వారు వినతిపత్రం అందించారు. అసోసియేషన్ నేత అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకునే అవకాశం మీసేవ, ఈసేవ సర్వీసుదారులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 2014-19 టీడీపీ హయాంలో తామే ఇవన్నీ చేసుకుని జీవనం గడుపుతున్నామన్నారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి యంత్రాలు, షాపులు, సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. జగన్ సర్కారు వచ్చాక అవన్నీ తీసేసి సచివాలయాలకు అప్పగించారని, దీంతో తామంతా ఆర్థికంగా నష్టపోయి ఉపాధిని కోల్పోయామన్నారు. స్పందించిన గిరిధర్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ముక్తియార్ అహ్మద్, దామోదర్, నాతిక్‌అహ్మద్, మదన్ పాల్గొన్నారు.



గిరిధర్‌రెడ్డితో అసోసియేషన్ నాయకులు

శ్మశానవాటిక అభివృద్ధి పనుల పరిశీలన

ముత్తుకూరు, అక్టోబరు 3: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో ముత్తుకూరు హిందూ శ్మశానాన్ని అభివృద్ధి చేయనున్నామని టీడీపీ మండల కార్యదర్శి నీల మల్లికార్జునయాదవ్ చెప్పారు. గురువారం శ్మశాన వాటిక అభివృద్ధి పనులను టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూదూరు లక్ష్మీ, లీగల్‌సెల్ నాయకులు షేక్ అబ్దుల్ షఫీవుల్లా, టీడీపీ నాయకులు బొలిగర్ల శ్రీనివాసులు, సుంకర శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కలశస్థాపనతో నవరాత్రోత్సవాలు ప్రారంభం

- వైభవంగా యమునా పూజ, కలశస్థాపన

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 3: జొన్నవాడ ఆలయంలో కలశ స్థాపనతో కామాక్షితాయి శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయ ఈఓ ఏవీ.శ్రీనివాసులురెడ్డి, ఉభయదాతల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, పండితులు, పురోహితులు పెన్నానదికి వెళ్లి యమునా పూజలు నిర్వహించారు. నది నుంచి పొట్టమట్టి, పవిత్ర గంగాజలాలను వేద మంత్రాలు, మంగళమేళాలతో తీసుకొచ్చారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కలశస్థాపన కార్యక్రమానికి చింతం సుందరరామిరెడ్డి ఉభయదాతలుగా వ్యవహరించారు. ఉత్సవాలలో భాగంగా కామాక్షితాయి అమ్మవారు నేడు త్రిపురాంబికా అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. కాగా, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు గురువారం అమ్మవారిని దర్శించుకున్నారు. కలశ స్థాపన పూజల్లో పాల్గొన్నారు. ఈవో శ్రీనివాసులురెడ్డి, అర్చకులు వేమిరెడ్డి దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేసి శేష వస్త్రాలతో సత్కరించారు. అనంతరం వారు అమ్మవారి మీద రచించిన 9 కామాక్షితాయి భక్తిగీతాల సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, స్థానిక సర్పంచు కందికట్టు పెంచలయ్య, ఉమ్మయ్యస్వామి, కమలాకర్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, నందకుమార్ పాల్గొన్నారు.



గర్భాలయంలో ఉత్సవాలకు స్థాపించిన కలశం

ఉత్సవాల పర్యవేక్షకుడిగా తిరుమూరు అశోక్‌రెడ్డి

ఆలయంలోని ఉత్సవాలకు ప్రత్యేక పర్యవేక్షకులుగా పోతిరెడ్డిపాళెం తిరుమూరు అశోక్‌రెడ్డికి ఎమ్మెల్యే బాధ్యతలు అప్పగించారు. ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చే భక్తుల సౌకర్యాలు, వసతుల కల్పనలో ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.

కోనలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం

రాపూరు, అక్టోబరు 3: పెంచలకోన క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆదిలక్ష్మీ అమ్మవారికి వస్త్ర సమర్పణ, పుష్పాలంకరణ, కలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని సౌభాగ్యలక్ష్మీగా అలంకరించి సామూహిక కుంకుమార్చన చేశారు. క్యూలైన్లు ఏర్పాటుచేసి భక్తులకు తాగునీరు అందించినట్లు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించినట్లు ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

దసరా వేడుకల్లో కోవూరు ఎమ్మెల్యే

విడవలూరు: విడవలూరు, ముదివర్తి గ్రామాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవ వేడుకల్లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. అలాగే కోవూరు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెముకుల కృష్ణచైతన్య, పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల శ్రీనివాసులు, ఎస్‌కె.రఫీ, ఇమామ్‌బాషా, రామిరెడ్డి వెంకటేశ్వర్లు, తాతా బాలకృష్ణ, సత్యవోలు సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంటు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 3 : విశాఖ స్టీల్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించడాన్ని ఖండిస్తూ కలెక్టరేట్ ఎదుట గురువారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దీక్ష జరిగింది. ఈ సందర్భంగా మోర్చా జిల్లా కార్యదర్శి గంగపట్నం రమణయ్య మాట్లాడుతూ తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకుని, పర్మినెంటు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ దిశగా అడుగులు పడుతున్నాయని చెప్పారు. ప్రైవేటీకరణను వెంటనే ఆపాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే షానవాజ్, మూలి వెంగయ్య, వై. శ్రీనివాసులరెడ్డి, బీ మోహన్‌రావు, పీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలక్ష్మిగా అమ్మవారు దర్శనం

- వేదగిరిపై నవరాత్రి ఉత్సవాలు

నెల్లూరు రూరల్,అక్టోబరు 3 : వేదగిరిలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు ఆదిలక్ష్మిగా భక్తులకు తొలి దర్శనమిచ్చారు. నవరాత్రి వేడుకలకు అర్చక బృందం సిద్ధమవగా, అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి మందిరంలో విశేష పూజలు, అభిషేకాలు అనంతరం ఆదిలక్ష్మి అవతారంలో అమ్మవారిని ముస్తాబుచేశారు. కాగా శుక్రవారం ధాన్యలక్ష్మిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

జయభారత్‌లో దుస్తుల పంపిణీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 3: జయభారత్ వైద్యశాలలో శ్రీరంగనాథ భక్తి మండలి, శ్రీరాజరాజేశ్వరి భక్త మండలి సభ్యులు గురువారం పారిశుధ్య కార్మికులకు, కాటికాపరులకు, వైద్యశాల సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా రంగనాథ భక్తి మండలి, శ్రీ రాజరాజేశ్వరి భక్తమండలి సభ్యుల ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మిడతల రమేష్, రామానందగిరిస్వామీజీ, భయ్యా బద్రీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు రెడ్‌క్రాస్ అభినందన

నెల్లూరురూరల్ : ఇటీవల ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గుడిపల్లిపాడులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించిన టీడీపీ నాయకులను రెడ్‌క్రాస్ సత్కరించింది. గురువారం నెల్లూరులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో టీడీపీ నాయకులు మేకల అనిల్‌కుమార్, హుస్సేన్‌బాషాలను జ్ఞాపికతో అభినందించారు.

వేమిరెడ్డి దంపతులను కలిసిన కార్పొరేటర్

నెల్లూరు(హరనాథపురం) : ఇటీవల టీడీపీలో చేరిన నాలుగో డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీప్రత్యూష దంపతులు గురువారం వీపీఆర్ నివాసంలో ఎంపీ వేమి రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులను మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తుమ్మగుంట శేషయ్య, ఏలేశం భాస్కర్‌రెడ్డి, చల్లా శంకర్‌యాదవ్, నెలవాయి చక్రపాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే దిగిపో!

- గాదెలదిన్నె సర్పంచుపై గ్రామస్థుల ఆగ్రహం
- రసాభాసగా గ్రామసభ

విడవలూరు, అక్టోబరు 3: సమస్యలను పరిష్కరించకుంటే సర్పంచుగా దిగిపోవాలని సర్పంచు తుమ్మల వెంకటేశ్వర్లుపై గాదెలదిన్నె గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక సచివాలయంలో సర్పంచు అధ్యక్షతన జరిగిన గ్రామసభను కార్యదర్శి శ్రీనివాసులు నిర్వహించారు. ఈ సభలో గ్రామస్థులతో పాటు సీపీఎం నాయకులు వెంకటరావులు పాల్గొని మాట్లాడారు. వేళకు హాజరుకాని అధికారులు ప్రజా సమస్యలను ఏవిధంగా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. రోజులు తరబడి గ్రామంలో తాగునీటి చేతిబోర్లు మరమ్మతులకు గురైనా ఇంతవరకు వాటి సంగతి ఎందుకు పట్టించుకోలేదన్నారు. విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మలని తొలిగించకపోవటంతో కొద్దిపాటి గాలి వీస్తే కరెంటుని తీసివేస్తున్నారని వాపోయారు. చేతిబోర్లు మూతలను తొలగించటంతో అందులో చిన్నారులు పడితే పరిస్థితి ఏమిటని గ్రామ సర్పంచుని నిలదీశారు. గ్రామ పంచాయతీలో నిధులు ఉన్నా వాటిని సర్పంచు ఖర్చు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యలపై త్వరలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. దీంతో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకుల కొడిమేర్ల శేషయ్య, వీఆర్వో సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద నేత్రదానం

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 3 : నగరానికి చెందిన నెల్లూరు సులోచనమ్మ(75) బుధవారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె కుమారుడు నెల్లూరు భక్తవత్సలరెడ్డి మృతురాలి నేత్రాలను సింహపురి దేహ సమర్పణ సంస్థ ద్వారా మోడరన్ కంటి ఆసుపత్రికి అందచేశారు. కుటుంబ సభ్యులకు నేత్రదాన గుర్తింపు కార్డు అందచేశారు. ఒకిరి నేత్రదానంతో ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేహ సమర్పణ సంస్థ కన్వీనర్ విజయ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో అధిక దిగుబడులు

తోటపల్లిగూడూరు : పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే భూమి సారవంతంగా తయారై అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి శిరీష పేర్కొన్నారు. పొట్లపూడి, వెంకన్నపాలెంలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

అక్రమాలు లేకుండా మున్సిపాలిటీ అభివృద్ధి

- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి
- 31 అజెండాలపై సభ్యుల ఏకగ్రీవ ఆమోదం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 3: ప్రతివార్డును మీ సొంత ఇంటిలాగా కలసికట్టుగా ఉండి చూసుకోవాలని బుచ్చి మున్సిపాలిటీలో అక్రమాలు, అవినీతి లేకుండా అభివృద్ధి చేసుకుందామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నగర పంచాయతీ కౌన్సిలర్లకు పిలుపునిచ్చారు, గురువారం మున్సిపాలిటీ కౌన్సిల్‌హాల్లో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్వర్యంలో కౌన్సిలర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో పెట్టిన 31 అజెండాలను కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించంపై ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పలు పొదుపు గ్రూపులకు రూ.90లక్షలు బ్యాంకు రుణాల చెక్కులు అందజేశారు. ముందుగా ఎమ్మెల్యేను చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కూటమి నాయకులు ఘనంగా స్వాగతించారు.

లెక్కాపక్కా లేకుండానే రూ.2కోట్ల స్వాహా

గత కమిషనర్ లెక్కాపక్కా లేకుండా రూ.2కోట్లు స్వాహా చేసి వెళ్లిపోయారని 5వ వార్డు కౌన్సిలర్ ఎస్‌కే. షాహుల్ వెల్లడించారు. చెట్లు తొలగింపుకు రూ.3లక్షలు, నగర పంచాయతీ నిధులు రూ.1.40కోట్లు, రిజిస్ట్రాఫీసు నుంచి వచ్చే నిధులు ఏమయ్యాయో కూడా తెలిడం లేదని వాపోయారు. వచ్చే కమిషనర్లంతా కోట్లు తినేసి వెళ్తుంటే నగర పంచాయతీ అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఇన్ని కోట్లు తినేస్తుంటే ఏమి చేస్తున్నారని ఎమ్మెల్యే కౌన్సిలర్లను ప్రశ్నించి టీడీపీ ప్రభుత్వంలో ప్రతి పనికి లెక్కలుంటాయని స్పష్టం చేశారు.



పొదుపు సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

మెప్మాలో పెద్ద గ్యాంబ్లింగ్

మెప్మాలో కోట్లు రూపాయలు నిధులున్నా బుచ్చిలో ఎవ్వరికి ఏమి ఉపాధి కల్పించలేదంటే మెప్మాలో పెద్ద గ్యాబ్లింగ్ జరుగుతోందని 3వ వార్డు కౌన్సిలర్ అందే ప్రత్యూష మెప్మా అధికారులను ప్రశ్నించారు. 3వ వార్డులో కనీసం తినేదానికి తిండికూడాలేని పేదల్లో ఒక్కరికీ ఉపాధి కల్పించిన పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మెప్మా అధికారులు, ఆర్‌పీలు, నాయకులు హరికృష్ణ, ఎంవీ.శేషయ్య, శేషయ్య, హరనాద్, ప్రభాకర్‌రెడ్డి, కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు, ఎస్ కిషోర్, భువనేశ్వరం మురళి, గుత్తా శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా వెళ్లి..

- బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన విష్వక్సేనుడు
- శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ

శ్రీవారి సేనాధిపతిగా పిలిచే విష్వక్సేనుడు విశేష అలంకరణతో, గదతో తిరుచ్చి వాహనం అధిరోహించారు. గురువారం సాయంత్రం ఏడు గంటలకు ఆలయం వెలుపలకు ఊరేగింపుగా వచ్చారు. మహద్వారం వద్ద హారతి అందుకుని నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మాడవీధుల్లో బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ సందర్భంగా సేనాధిపతి ఊరేగింపు నిర్వహించారు. మరోవైపు ఆలయంలోని యాగశాలకు సమీపంలో అంకురార్పణ జరిగే ప్రదేశాన్ని ముందుగానే పేడతో అలంకరించారు. ఆ తర్వాత సేనాధిపతి ఊరేగింపు అనంతరం ఆ ప్రదేశంలో బ్రహ్మపీఠాన్ని ఏర్పాటు చేశారు. మంట ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ అనే దేవతలను ఆహ్వానించారు. అనంతరం భూమాతను ప్రార్థిస్తూ అందులో ముందుగానే సేకరించిన పుట్టమన్నును కుండలలో వేశారు. శాలి, వ్రహి, యువ, ముద్గ, మాష, ప్రియంగు వంటి నవధాన్యాలను చల్లి నీరు పోశారు. ఆ పాలికలను నూతన వస్త్రంతో అలంకరించి పుణ్యాహవచనం నిర్వహించారు. తర్వాత సోమరాజ మంత్రం, వరుణ మంత్రం, విష్ణుసూక్తం పఠించారు. ప్రతిరోజూ ఈ పాలికల్లో కొద్దిగా నీరు పోస్తూ మొలకలు వచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఇలా వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టాన్ని నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామి ఆశీస్సులు పొందడమే ఈ ఘట్టం ఉద్దేశం. అంకురార్పణలో చల్లిన విత్తనాలు బాగా మొలకెత్తడం వల్ల ఉత్సవాలు కూడా గొప్పగా జరుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ అంకురార్పణ కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఇది భగవంతుడి సమయం



అన్ని మతాలను గౌరవిస్తా

సనాతన ధర్మంపై దాడి చేస్తామంటే ఊరుకోను

'వారాహి డిక్లరేషన్' సభలో పవన్

'ఇది ఎన్నికల సమయం కాదు. సినిమా సమయం అంతకన్నా కాదు. భగవంతుడి సమయం. ఇస్లాం సమాజాన్ని చూసి నేర్చుకోండి. వాళ్లు 'అల్లాహ్' అంటే ఆగిపోతారు. మనం 'గోవిందా' అన్నా ఆగం. నేను మీతో చప్పట్లు కొట్టించుకోవాడానికో, జేజేల కోసమో రాలేదు. సనాతన ధర్మాన్ని మట్టిలో కలిపేస్తామన్న వారితో గొడవ పెట్టుకునేందుకువచ్చా' అంటూ వారాహి డిక్లరేషన్ సభ ఉద్దేశ్యాన్ని స్పష్టం చేశారు జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. తన ప్రసంగం కోసం యువత ఈలలు, కేకలతో కేరింతలు కొడుతుండగా, ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంతో సభ ఒక్కసారిగా మౌనం దాల్చింది. తిరుపతిలోని పూలే విగ్రహం వద్ద గురువారం సాయంత్రం 6 గంటలకు జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. 'ఇస్లాం, క్రిస్టియన్, సిక్కు, జైన్.. ఇలా అన్ని మతాలు, వారి ధర్మాలను గౌరవిస్తా. అయితే సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్టు దాడిచేస్తానంటే మౌనంగా కూర్చోలేను. నన్ను వ్యక్తిగతంగా తిట్టినా, అవమానపరిచినా మాట్లాడలేదు. కలియుగదైవానికి కూడా అపచారం జరిగితే మెత్తగా ఎలా ఊరుకుంటా'నంటూ తనదైన శైలిలో హెచ్చరికలు చేశారు. 'సనాతన ధర్మంలాంటి వైరస్‌ను అంతం చేయాలి' అని చెప్పిన తమిళనాడు రాష్ట్ర డిప్యూటీ సీఎం ఉదయనిధికి తమిళ భాషలోనే కౌంటర్ ఇచ్చారు. ఇతర మతాలపై ఈ వ్యాఖ్యలు చేస్తే స్పందించే న్యాయస్థానాలు... సనాతన ధర్మంపై మాట్లాడితే మౌనంగా ఉంటున్నాయని ఇంగ్లీషులో తన అసంతృప్తి వ్యక్తం చేశారు. అయోధ్య రామాలయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ సూడో సెక్యులరిస్టులంటూ హిందీలో మాట్లాడారు. 'కొండెక్కి అరచేతిలో హారతి వెలిగించుకునే మీ డ్రామాలు తెలియవా? ఆ నాటకాలకు తగిన మూల్యం చెల్లించేది దేవుడొక్కడే! ఆయన నిజ రూప దర్శనం రోజు అప్పుడంతా తెలుస్తుంది' అంటూ టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డిపై పవన్ మండిపడ్డారు. 'తన హయాంలో కల్తీ నెయ్యిపై ఇంత జరుగుతున్నా మాజీ ఈవో ధర్మారెడ్డి స్పందించకుండా ఏమయ్యారు? కొడుకు చనిపోయిన 15రోజులకే ఎలా ఆలయంలోకి వస్తారు?' అంటూ ప్రశ్నించారు. ఇలా సనాతన ధర్మం.. ఈ విషయంలో గత ప్రభుత్వ తప్పిదాలు.. వారాహి డిక్లరేషన్‌పైనే పవన్ ప్రసంగం సాగింది. స్థానిక సమస్యలు, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలేవీ ప్రస్తావించలేదు. సభలో యువత, అభిమానులు ఎక్కువగా కనిపించారు. ఇక, సభ ప్రారంభంలోనూ పక్కన ఉన్న కూటమి నాయకుల పేర్లు కూడా చెప్పకపోవడం వారిని అసంతృప్తి పరిచింది.వారాహి వాహనంపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన నేతలు, ఎమ్మెల్సీ హరిప్రసాద్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, బీజేపీ నేత భాను ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి కుమారులు మదన్, జగన్ ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మను వాహనంపైకి పిలిచినప్పటికీ ఎక్కకుండా ఆమె వెళ్లిపోయారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

> 'పవన్ ఉన్నాడంటే వెంకన్న దయ. మా తల్లి నాకు అన్నప్రాసనం చేసిందీ తిరుమల కొండపైనే. ఇక్కడి బాలాజీ కాలనీలో యోగిని రాజేశ్వరిదేవి దగ్గర యోగాభ్యాసం చేశా.'

బయోమెట్రిక్ ద్వారా గదుల కేటాయింపు

శ్రీకాళహస్తి, అక్టోబరు 3: శ్రీకాళహస్తీశ్వరాలయ అధ్వర్యంలోని వసతిగృహాల్లో గదులను బయోమెట్రిక్ ద్వారా కేటాయించనున్నట్లు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్వో కార్యాలయం వద్ద, వసతి సముదాయంలో కానీ గదులను బుక్ చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు, ఏదైనా ఇతరగుర్తింపు కార్డులతో స్వయంగా బుక్ చేసుకోవాలని తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

18 కేజీల గంజాయి స్వాధీనం - ఒకరి అరెస్టు


మాట్లాడుతున్న సీఐ ఏవీ రమణ

వెంకటగిరిటౌన్, అక్టోబరు 3: వెంకటగిరి రైల్వే స్టేషన్‌లో 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ఏవీ రమణ తెలిపారు. వెంకటగిరి పోలీస్‌స్టేషన్‌లో గురువారం సీఐ మీడియాతో మాట్లాడుతూ... బుధవారం రాత్రి 11 గంటలకు రైల్వేస్టేషన్‌లో స్మగ్లింగ్ జరుగుతుందని అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా, తమిళనాడుకు చెందిన షేక్ కైఫ్ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. ఒడిశా నుంచి తమిళనాడుకు అక్రమంగా గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నాడని తెలిపారు. ఇతడి వద్ద 18 కేజీల గంజాయి, రెండు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్‌లుగా చేసి యువతకు విక్రయిస్తున్నట్లు నిందితుడు వివరించాడని తెలిపారు. ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 3: ప్రతియేటా ఇస్రో ఆధ్వర్యంలో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ వారు అక్టోబరు 4 నుంచి 10 వరకు వారం రోజుల పాటు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. శుక్రవారం షార్‌లో ఈ వారోత్సవాలను ప్రారంభించనున్నారు. మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, ఒడిశా మూడు రాష్ట్రాల్లో నిర్వహించనున్నారు.

చెంబేడు చెరువు అభివృద్ధికి నిధులివ్వండి



పెళ్లకూరు, అక్టోబరు 3: మండలంలోని 11 గ్రామాలకు సాగు, తాగునీరు అందించేందుకు రూపొందించిన చెంబేడు చెరువు రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి కోరారు. గురువారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకుడు నెలవల రాజేష్‌తో కలసి అమరావతి సచివాలయంలో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.


సూళ్లూరుపేటలో పరమేశ్వరి అలంకారంలో చెంగాళమ్మ - నాయుడుపేటలో మూకాంబికాదేవిగా అమ్మవారు - గూడూరులో బాలాత్రిపురా సుందరీదేవిగా విజయదుర్గాదేవి - గూడలిలో బాలత్రిపురా సుందరి అలంకారంలో చాముండేశ్వరి అమ్మవారు

ఘనంగా ప్రారంభమైన శరన్నవరాత్రి వేడుకలు

● పరమేశ్వరిగా చెంగాళమ్మ

సూళ్లూరుపేట, అక్టోబరు 3: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో గురువారం నుంచి శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కాళంగి నది జలాలను కలశాలతో అమ్మణ్ణి చెంతకు తీసుకొచ్చి కలశ స్థాపన చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అఖండ జ్యోతిని వెలిగించి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. ఉభయకర్తగా బీరక రాంబాబు దంపతులు వ్యవహరించారు. యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి మహా చండీయాగం వైభవంగా నిర్వహించారు.

పరమేశ్వరిగా చెంగాళమ్మ

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా చెంగాళమ్మ గురువారం భక్తులకు పరమేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం విశేష పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకొన్నారు. తొలిరోజు అమ్మవారికి పుట్టినిళ్లు అయిన గొల్లలములువు నుంచి సారెను సమర్పించారు. కాగా చెంగాళమ్మ శుక్రవారం గాయత్రి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అదేవిధంగా సూళ్లూరుపేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అలంకారంలో, గంగా పార్వతీ త్రినేత్ర సంభూతుడైన నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

గూడూరు: పట్టణంలోని పలు ఆలయాల్లో కలశ స్థాపన పూజా కార్యక్రమాలతో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో విజయదుర్గాదేవి అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవి, నారాయణమ్మ పేరంటాళ్ల ఆలయంలో రాజరాజేశ్వరీదేవిగా, కన్యకాపరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరిదేవిగా, ధర్మరాజులస్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని మహాకాళిగా, రాజరాజేశ్వరిదేవి ఆలయంలో బాలాత్రిపురసుందరీదేవిగా, గంగమ్మ ఆలయంలో శ్రీలక్ష్మీదేవిగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాయుడుపేట టౌన్: నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ పార్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని మూకాంబికాదేవి ఆలయంలో అమ్మవారు మూకాంబికాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే దుర్గాదేవి, కన్యకాపరమేశ్వరి, మానసాదేవి ఆలయాలలో కూడా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు.

కోట: గూడలిలోని రామలింగ చాముండేశ్వరి అమ్మరు బాలత్రిపుర సుందరిదేవిగా, కోటలోని గ్రామదేవత కోటమ్మ అమ్మవారు మహంకాళి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరులో వెలసివున్న ముత్యాలమ్మ అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించి అర్ధరథంపై గ్రామోత్సవం జరిపారు. కలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని సౌభాగ్యలక్ష్మీగా అలంకరించారు.

వెంకటగిరిటౌన్: శరన్నవరాత్రిల్లో భాగంగా పట్టణంలోని గురువారం వాసవి కన్యకాపరమేశ్వరి మాతకు పరమేశ్వరి అలంకారం, మూలవిరాట్‌కు పసుపు అలంకారం, వెలమపాళెంలోని మంద నాంచారమ్మకు పార్వతి దేవి అలంకారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కోట, అక్టోబరు 3: కోట వెలుగు కార్యాలయంలో స్త్రీనిధి రుణాలపై నిర్వహించిన సమావేశంలో ఏపీఎం అనీల మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు



సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ.50 లక్షల విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, అపాచీ పరిశ్రమ డైరెక్టర్ గెవిన్‌చాంగ్ తదితరులు

నాయుడుపేట/తడ, అక్టోబరు 3: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ.50లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గురువారం అందజేశారు. అమరావతి ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబును కలుసుకున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తడ మండలం మాంబట్టు సెజ్‌లోని అపాచీ పరిశ్రమ అందజేసిన రూ.10లక్షల చెక్కుతో పాటు వివిధ వర్గాల నుంచి వచ్చిన విరాళాలను కలిపి మొత్తం రూ.50లక్షల చెక్కులను ముఖ్యమంత్రికి అందజేశారు. చెక్కులను అందజేసిన వారిలో ఎమ్మెల్యేతోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, అపాచి పరిశ్రమ డైరెక్టర్ గెవిన్‌చాంగ్, పీఆర్‌వో మోహన్, టీడీపీ నాయకులు పార్థసారథి, నెలవల రాజేష్, పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన వేనాటి



సూళ్లూరుపేట, అక్టోబరు 3: మంత్రి నారా లోకేశ్‌ను తిరుపతి పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి ఉండవల్లిలోని ఆయన నివాసంలో బుధవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లోకేశ్‌ను శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు.

జిల్లా సర్వే అధికారిగా అరుణ్‌కుమార్



తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 3: జిల్లా సర్వే, భూ రికార్డుల శాఖాధికారిగా డి.అరుణ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జయరాజ్ నంద్యాలకు బదిలీ అయ్యారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అరుణ్‌కుమార్ ఖరగ్‌పూర్ ఐఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు.

వైఖానస ఆగమాలపై శిక్షణ

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 3: దైవారాధనలో వైఖానస ఆగమ అర్చనా విధులపై తొమ్మిది రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం డీన్ వీఎస్ విష్ణుభట్టాచార్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చన ప్రయోజనం, ఉపచారాల రకాలు, అర్చనలో వినియోగించే ద్రవ్యాలు, ఆగమాలలో వైఖానసాగమ స్వరూపం అనే వివిధ విషయాలపై సంస్కృత విశ్వవిద్యాలయం ఆన్‌లైన్ విధానంలో ఈనెల 16 నుంచి తొమ్మిది రోజులు శిక్షణ ఇస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు పేర్ల నమోదు, వివరాల కోసం htpp://forms.gle/dbhmjwtor2h9pj1ka వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

మోసం కేసులో భార్యాభర్తలకు జైలు శిక్ష

సూళ్లూరుపేట, అక్టోబరు 3: కంపెనీలో భాగస్వామ్యం ఇప్పిస్తామని చెప్పి రూ.25 లక్షలు తీసుకొని మోసం చేసిన కేసులో తిరుపతి నాగార్జునరావు, ఆయన భార్య స్వరూపలకు సూళ్లూరుపేట అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి ఎస్.అనూష రెండేళ్ల జైలు శిక్ష విధించారు. వివరాల్లోకి వెళితే... తడ మండలం కట్టవ గ్రామంలో ఉన్న భారత్ సర్క్యూట్స్ కంపెనీ ఎండీగా ఉన్న టి.నాగార్జునరావు 2009లో సూళ్లూరుపేట గాండ్లవీధికి చెందిన కల్లేటి సుబ్రహ్మణ్యం వద్ద కంపెనీలో భాగస్వామ్యం ఇప్పిస్తామని రూ.25 లక్షలు తీసుకొన్నారు. కంపెనీలో భాగస్వామ్యం ఇవ్వకుండా బయటకు పంపించడంతో బాధితుడు తడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి తడ ఎస్ఐ బి.హరికృష్ణ కేసు దర్యాప్తు చేసి తగిన ఆధారాలతో ఛార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించారు. న్యాయమూర్తి కేసును విచారించి, ముద్దాయిలపై నేరం రుజువుకావడంతో భార్యాభర్తలిద్దరికీ రెండేళ్ల జైలు శిక్ష, రూ.24,000 జరిమానా విధించారు. కేసును ప్రాసిక్యూషన్ తరపున సూళ్లూరుపేట ఏపీపీ కేజే ప్రకృతికుమార్ వాదించారు.

చెరువులో చేపలు వదలొద్దంటూ దండోరా

● దళితులను బెదిరించిన గతేడాది లీజుదారుడిపై ఫిర్యాదు

పెళ్లకూరు, అక్టోబరు 3: మండలంలోని చిల్లకూరు పెద్దచెరువులో పంచాయతీ అనుమతులు లేకుండా చేపలు వదలకూడదని.. తూములకు మెష్‌లు కట్టొద్దని సర్పంచు పగడాల హరిబాబురెడ్డి ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో దండోరా వేశారు. అయితే గత ఏడాది చెరువులో చేపలు పట్టిన వడ్డిపాలెం గ్రామానికి చెందిన మద్దూరు రమణయ్య, దయాకర్, గిరి, కార్తీక్‌లతో కలసి దండోరా వేస్తున్న దళితులను దుర్భాషలాడి బెదిరించిన ఘటనపై గురువారం సర్పంచు హరిబాబురెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్పంచు హరిబాబురెడ్డి మాట్లాడుతూ దండోరా వేస్తున్న దళితులను దుర్భాషలాడటంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు తనతోపాటు రైతులు, బాధితులు పోలీస్ స్టేషన్ చేరుకోగా ఎస్ఐ నాగరాజు ఫిర్యాదు తీసుకునేందుకు నిరాకరించారని తెలిపారు. దీంతో 112కు డయల్‌చేసి ఫిర్యాదుచేయడంతో ఎస్ఐ ఫిర్యాదును స్వీకరించినట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేశారంటూ ఫిర్యాదు

కోట, అక్టోబరు 3: మండల పరిధిలోని సిద్ధవరం పంచాయతీలో గల ఇలకూరుపాడులో ప్రభుత్వం ఇచ్చిన భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి కబ్జాచేశారంటూ గురువారం దామరపు హేమలత, గ్రామస్థులు తహసీల్దారు జయజయరావుకు ఫిర్యాదు చేశారు. ఇలకూరుపాడులో తమకు 18 సంవత్సరాల క్రితం 23 సెంట్ల ప్రభుత్వ భూమితో పాటు పట్టా కూడా ఇచ్చినట్లు హేమలత తెలిపారు. స్థానికంగా ఉన్న కొంతమంది ఆ భూమిని తమ భూమిలో కలుపుకుంటూ దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. తక్షణం స్పందించి తమకు న్యాయం చేయాలంటూ గ్రామస్థులు తహసీల్దారు, ఎస్ఐకు ఫిర్యాదు చేశారు.

వేర్వేరు కేసుల్లో ముగ్గురికి కత్తిపోట్లు

గూడూరు అర్బన్, అక్టోబరు 3: పట్టణంలో బుధవారం రాత్రి ప్రారంభమైన జెండా ఉత్సవాల్లో గురువారం వేకువజామున రెండు వేర్వేరు సంఘటనల్లో ముగ్గురు యువకులు కత్తిపోట్లకు గురై గాయపడ్డారు. ఒకటో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక చిన్నమసీదు వీధికి చెందిన హరీష్ అనే యువకుడు తిరుమలలో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. జెండా ఉత్సవాలను తిలకించేందుకు స్థానిక చిన్నమసీదు వీధిలో ఉంటున్న బంధువు యశ్వంత్ ఇంటికి వచ్చాడు. యశ్వంత్‌తోకలిసి జెండాలను తిలకిస్తున్నాడు. వేకువజామున మసీదువీధి ప్రాంతంలో జెండా ఊరేగింపులో కొందరు యువకులు గొడవపడుతూ యశ్వంత్‌పై పడ్డారు. దీనిపై స్థానిక అరుంధతీయవాడకు చెందిన గోవిందును యశ్వంత్ ప్రశ్నించడంతో వివాదం జరిగింది. ఈ క్రమంలో గోవిందు కత్తితో యశ్వంత్, హరీష్‌లపై దాడి చేసి గాయపరిచాడు. గాయపడిన వారిని స్థానిక ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు పట్టణ సీఐ శేఖర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా స్థానిక కృష్ణమందిరం వీధికి చెందిన అబ్దుల్ రెహమాన్, అతడి స్నేహితుడు భాస్కర్‌తో కలిసి జెండా ఉత్సవాల్లో శివాలయం వద్ద ఉన్నారు. గురువారం వేకువజామున పట్టణానికి చెందిన ఇమ్మానియేలు అక్కడకు వచ్చాడు. భాస్కర్‌కు, ఇమ్మానియేలుకు పాత గొడవలు ఉండడంతో వారిద్దరు గొడవపడ్డారు. పక్కనే ఉన్న అబ్దుల్ రెహమాన్ సర్ది చెబుతుండగా, ఇమ్మానియేలు తోసివేయడంతో అతడు కిందపడ్డాడు. ఇదే సమయంలో ఇమ్మానియేలు స్నేహితుడు పట్టణానికి చెందిన శ్రీనాథ్ కత్తితో అబ్దుల్ రెహమాన్‌ను పొడిచి గాయపరిచాడు. గాయపడిన అబ్దుల్ రెహమాన్‌ను చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ శేఖర్‌బాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నాయుడుపేట టౌన్, అక్టోబరు 3: మండలంలోని అన్నమేడు స్వర్ణముఖి నది తీరం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అర్బన్ సీఐ బాబి గురువారం స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.



రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినందుకు అవార్డు


చంద్రశేఖర్‌రెడ్డి నుంచి అవార్డును అందుకుంటున్న మనోజ్‌కుమార్

గూడూరు, అక్టోబరు 3: పట్టణానికి చెందిన మనోజ్‌కుమార్‌కు నెల్లూరులో గురువారం నెల్లూరు రెడ్‌క్రాస్ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి బెస్ట్ మోటివేటర్ అవార్డును అందజేశారు. గిద్దలూరు రమణయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మనోజ్‌కుమార్ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 200 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్‌కు అందజేయడంతో ఈ అవార్డును అందజేసినట్లు ఆయన తెలిపారు.

శివకుమార్‌కు రెడ్‌క్రాస్ సేవాపురస్కారం ప్రదానం


శివకుమార్‌ను అభినందిస్తున్న కిషోర్ నాయుడు

వాకాడు, అక్టోబరు 3: వాకాడు జనసేన మండల అధ్యక్షుడు రౌతు శివకుమార్‌కు రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ కిషోర్ నాయుడు షీల్డ్‌తోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. శివకుమార్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా వాకాడు మండలంలో 95మంది నుంచి రక్తంసేకరించి రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేసినట్లు చెప్పారు. కన్వీనర్ ఎంకే రెడ్డి ఉన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం


విజయభాస్కర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న పోలేరమ్మ కమిటీ సభ్యులు

నాయుడుపేట, అక్టోబరు 3: నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. గురువారం టీడీపీ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డికి పోలేరమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు అరవ పెరిమిడి చంద్రారెడ్డి, పెదకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి, ఆకుల కుబేరుమణి, నల్లబోతుల రామారావు, రాయపూడి మునిసురేష్ పాల్గొన్నారు.

12 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు

గూడూరు/నాయుడుపేట టౌన్, అక్టోబరు 3: రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని ప్రవేశపెట్టడంతో ఈనెల 12వ తేదీ నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నాయని జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి నాగమల్లేశ్వర రెడ్డి అన్నారు. గురువారం గూడూరు, నాయుడుపేటలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణంలో 12, చిల్లకూరు మండలంలో 6 మద్యం దుకాణాలు, నాయుడుపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నాయుడుపేట మున్సిపాలిటీలో 13, ఓజిలి మండలంలో 2, పెళ్లకూరు మండలంలో 2 మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయన్నారు. ఈదుకాణాలకు 9వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌ల ద్వారా స్వీకరించనున్నట్లు తెలిపారు. 11న తిరుపతిలో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఊహశ్రీ, సీఐలు కరీమాబేగం, బాలకృష్ణ, అరుణకుమారి పాల్గొన్నారు.

తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన వారిని శిక్షించాలి

గూడూరు, అక్టోబరు 3: తిరుమల లడ్డూని అపవిత్రం చేసిన వ్యవహారంలో ప్రభుత్వం దర్యాప్తు నిర్వహించి నిందితులను శిక్షించాలని వీహెచ్‌పీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు.